ఆదివారం
ప్రజాశక్తి
మే 9, 2004



పాప్‌లో మునిగి తేలుతున్న సంగీతం

హ్యాపీ బర్త్‌డే

(9-5-2004 నుండి 15-5-2004 వరకు)

శివాని- సాయికృష్ణగౌడ్
మే-9
మమత-జానయ్య
నకిరేకల్-నల్లగొండ

డి. సందీప్
మే-9
పద్మ-శ్రీను
బ్రిడ్జిరోడ్- శ్రీకాకుళం

వి. ప్రకాష్ సుందర్
1సం॥, 10.5.2003
మేరీసుందరి-రాజశేఖర్‌బాబు
తెనాలి-గుంటూరు

ఆర్తి
4సం॥, 11.5.2000
లత-రాములు
కవాడిగూడ-హైదరాబాద్

క్రాంతి
3సం॥, 12.5.2001
శాంతకుమారి-రామరాజు
విజయవాడ-కృష్ణా

అన్నీ
4సం॥, 15.5.2000
దల్సి-వినయ్‌కుమార్
నానిప్పనగర్-హిందూపురం

పి.హర్షవర్ధన్
6సం॥, 15.5.1998
జ్యోతి-నాగేశ్వరరావు
చొప్పకట్లపాలెం-ఖమ్మం

అరుణజ్యోతి
8సం॥,మే-1996
ఎల్లమ్మ-వెంకన్న
నల్లగొండ

కె. వర్ధన్
1సం॥, మే-2003
చైతన్య-ప్రదీప్‌నాయుడు
గాజువాక-విశాఖపట్నం

మణికంఠ
సుమ-శ్రీనివాసరావు
బాణాపురం-ఖమ్మం

గమనిక: పదేళ్ళ వయస్సు వరకు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన రోజుకు 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:

హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, 1-1-298/4,
స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.



లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం

కవర్ స్టోరీ హైలైట్

ఏప్రిల్ 25, 2004 ఆదివారం అనుబంధంలో సౌందర్య కవర్ స్టోరీ హైలైట్. సౌందర్య కవర్ స్టోరీ కథనం చదివిన తర్వాత ఆమె విషాద మరణం ఎంతో బాధ కలిగించింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత పలువురు సినీ ప్రముఖులు బి.జె.పి., కాంగ్రెస్ పార్టీల్లో చేరడం, క్రికెట్ క్రీడాకారులు వివిధపార్టీలలో చేరడంతో తమ తమ పార్టీలు బలపడతాయని వివిధ రాజకీయ పక్షాలు భావిస్తున్నాయి. అదేవిధంగా తాజాగా సౌందర్య బి.జె.పి.లో చేరడం కూడా అటువంటిదే. ఒక పార్టీ నుండి మరొక పార్టీకి వలసలు పోవడం, రాజకీయ నాయకులకు కొత్తేమీ కాదు. కవర్ స్టోరీ మా అందరినీ ఆకట్టుకుంది.

– కె.ప్రభాకర్, చిమిర్యాల, నల్గొండ.

సౌందర్య నటించిన సినిమాలతో

'అనగనగా ఓ అమ్మాయి', 'రైతు భారతం'లో పుట్టి 'అంతఃపురం'లో పెరిగిన ఆంధ్రుల 'ఆరోప్రాణం' అయిన సౌందర్య 'సూర్యుడు'లా ఉదయించి 'టాప్‌హీరో'యిన్‌గా ఎదిగి హఠాన్మరణానికి గురవడం చాలా బాధాకరం. 'ఎదురులేని మనిషి'గా 'మాయలేడీ'గా 'మేడమ్'గా నటించిన సినిమాలు అపురూపం. రఘు గారితో 'పవిత్ర బంధం' కలుపుకొని 'పుట్టింటి గౌరవం'ను నిలబెట్టారు. 'నా మనసిస్తారా' అంటూ మా మనసులతో 'దొంగాట' ఆడి కానరాని చోటుకు వెళ్ళి మమ్మలను బాధపెట్టడం న్యాయంకాదు! ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో ఇచ్చిన సౌందర్య వివరాలు చాలా విపులంగా ఉన్నాయి.

– ఎలగందుల గణేష్,
ఆత్మకూరు (ఎం), నల్గొండ జిల్లా

కళాసాహితి బాగుంది

25 ఏప్రిల్ 2004 ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో కళాసాహితి శీర్షికన ప్రచురించిన గురుకేళూచరణ్ అంటేనే ఒడిస్సీ నృత్యం. ఒడిస్సీ నృత్య పితామహుడిగా ఒడిస్సీ నృత్య ప్రక్రియకు అద్భుతమైన రూపకల్పన చేసి, దేశ విదేశాలలో అవార్డులెన్నో అందుకొని అవార్డులకే గర్వకారణంగా నిలిచిపోయిన కేళూచరణ్ మహాపాత్రో అందరికీ ఆదర్శప్రాయుడు.

– మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

కరంటు తీగలు కథకాదు, రైతుల యదార్ధ గాథ

ఏప్రిల్ 25వ తేదీన ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కరంటు తీగలు కథ చాలా చక్కగా ఉంది. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న కరెంటు తీగల దొంగతనాలు, రైతులు పడే అవస్థలు అందులో పోలీసు శాఖ జోక్యం తదితర విషయాలను రచయిత కళ్ళకు కట్టినట్లుగా చూపించారు. అందుకే కరంటు తీగలు కథకాదు రైతుల యధార్థ గాథ. బత్తాయి తోటల రైతుల బాధలు, అడుగంటిన బోర్లు, రైతన్నలు పడుతున్న కష్టాలు తదితర వాటిని పొందుపరచడంతో పాటు సమాజం మేలుకొనేలా రచయిత జాగరూకతతో కథను చాలా చక్కగా నడిపారు. ఇటువంటి కథలు ఇంకా ఇంకా రచించాలని రచయిత వెంకట సుబ్బారావు కావూరిని మేము మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాము.

– షేక్ గఫారి, గోరంట్ల, అంకయ్య, షేక్ అమీర్‌బాషా, ఇమ్మడిశెట్టి రాఘవేంద్ర, షేక్ వలీసాహెబ్, యక్కలి సుబ్రహ్మణ్యం, షేక్ గౌస్‌పీర్ వలి, గణేష్, షేక్ ఖాజావలి, మెడబలిమి వెంకటేశ్వరరావు, రామావతు మధునాయక్, అంతటి శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌బాబు, అంతటి బాల చిన్నయ్య, శిఖామణి, కొమర, ఆత్మ, యర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా

మనలో మాట

ముందస్తు ఇఫ్తార్‌లు...

అదేమిటో...

చాన్నాళ్ళుగా రాష్ట్రంలో అన్నీ ముందస్తుగానే జరిగిపోతున్నాయి..

ముఖ్యమంత్రి చంద్రబాబుపై పీపుల్స్‌వార్ దాడి పుణ్యాన ఏడాది ముందుగానే అసెంబ్లీ రద్దయిపోయింది.

ఎన్నికలు మాత్రం చంద్రబాబు కోరిక ప్రకారం జరగలేదు.

అయినా...ముందస్తుగానే జరిగాయి..

పాపం....పోలింగ్ పూర్తయి ఇరవై రోజులపాటు ఫలితాల కోసం ఆగవలసి రావడంతో రాజకీయులకు ఒకటే టెన్షన్... టెన్షన్..

ఎగ్జిట్ పోల్స్ అన్నీ కాంగ్రెస్‌కు అనుకూలంగా రాగా తెలుగుదేశం అధినేత మాత్రం వాటిని నమ్మనుగాక నమ్మనంటున్నారు.

మరేదయితే నమ్ముతారని ప్రశ్నించితే.....

తెలుగుదేశానికి అనుకూలంగా వస్తేనే నమ్ముతానని ఢంకా భజాయించి చెబుతున్నారు.

అన్నీ ముందస్తుగానే నడుస్తున్నాయని ముందుగా మనవి చేసుకున్నట్లుగా....

ఓట్ల లెక్కింపు ఇంకా రెండు రోజులే ఉంది..

ఎవరి జాతకాలు ఏమిటో ఎలక్ట్రానిక్ పెట్టెలు బయటపెట్టేస్తాయి..

కాని,

అధికారం మాదంటే, మాదని రాష్ట్రంలోని రెండు ముఖ్యమైన పార్టీలు కుమ్ములాడుకుంటున్నాయి.

ఇప్పటివరకు అధికారంలో ఉన్న పార్టీ మాత్రం ఎన్నికల్లో పనిచేయని వారిని బహిష్కరిస్తాం, అది చేస్తాం, పొడి చేస్తాం అంటూ హెచ్చరిస్తున్నది.

ఒక పార్టీ నాయకులు సిఎం పదవి నాదంటే నాదని ముందస్తు కుమ్ములాటలకు దిగారు.. పాపం ముందస్తుగా విందులు కూడా ఇచ్చేస్తున్నారు.

రంజాన్ సమయాన రాజకీయపార్టీలు ఇఫ్తార్ విందులు ఇస్తాయి. బిజెపి లాంటి పార్టీలు కూడా ముస్లిం సోదరులను ఆకట్టుకోవడానికి, తాము సెక్యులర్ వాదులమని ఫోజులు పెట్టడానికి ఇఫ్తార్ విందులు ఇస్తాయి. అది అప్పటి వరకే.. వారితో తమ అవసరాలు తీర్చుకోవడానికే...

ఈ ముందస్తు ఇఫ్తార్‌లు కూడా ఆ కోవలోవే....

అన్నీ ముందస్తుగానే జరిగిపోతున్నా జాతకాలు మాత్రం అసలు సమయానికే తేలతాయి.

అంచేత, ఇప్పుడే విందులు ఇచ్చే నాయకులు పదవులు రాకపోతే ఏం చేస్తారు? విందులు వాపసు తీసుకుంటారో ఏమో?

ఈ సంచికలో . . .

ఔరా! . . . 3
కార్టూన్ కదంబం... . . . 4
కవర్ స్టోరీ . . . 5
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
ఇంతిసంగతులు . . . 16
జీవనశైలి . . . 17
ఆరోగ్యం . . . 18
పుస్తక పరిచయం . . . 20
న్యాయసలహాలు . . . 24

ఇంకా...

ఎయిర్‌పోర్ట్
కథ... 8, 9, 10

బహుమతి ఫోటో
రియల్‌స్టోరీ...14, 15



ఇది కళింగులేలిన ప్రాంతం...
టూరిస్ట్ గైడ్ . . . 21



సమాజ చైతన్యమే 'సముద్రాల' లక్ష్యం
కళాసాహితి . . . 22, 23

పచ్చబొట్ల పిచ్చి



పాశ్చాత్య దేశాల్లో ఏ పిచ్చి మొదలైతే ఆ పిచ్చి ఇక్కడా ఊపందుకుంటుంది. ఇటీవల ఇటువంటి పిచ్చిపనులు మరీ ఎక్కువవుతున్నాయి. పలువురు మోడల్స్, క్రీడాకారులు తమ శరీరంపై ఎక్కడ పడితే అక్కడ పచ్చబొట్లు వేయించుకునే సంస్కృతి బాగా పెరిగింది. దాన్ని చూసి మన దేశంలోనూ అనేక కంపెనీల వారు చాక్లెట్లలో అటువంటి స్టిక్కర్లు పెట్టి అమ్ముతూ పిల్లలను ఆ ఉచ్చులోకి లాగుతున్నారు. తాజాగా ముంబైలోని బాంద్రాలో ఒక వ్యాపారి పచ్చబొట్ల పార్లర్‌నే తెరిచాడు. ఇది దేశంలోనే మొదటిదట. భారతీయులైతే పచ్చబొట్లు బాగావేయరని యూరప్ దేశాలనుండి ఆర్టిస్టులను తెప్పించి ఏ విధమైన బొమ్మలు కావాలన్నా ఒంటిపై ఎక్కడైనా వేయిస్తున్నాడట. ఆడ, మగా అనే తేడా లేకుండా పచ్చబొట్లు వేయించుకునేందుకు ఆ పార్లర్ ముందు కాలేజీ విద్యార్థులు వేలం వెర్రిగా మూగుతున్నారట? వారి పిచ్చి వ్యాపారికి కాసుల వర్షం కురిపిస్తోంది!?



ఎటిఎం కార్డ్ హోల్డర్

దిషా అగర్వాల్ దేశంలో అతి పిన్నవయస్సులోనే ఎటిఎం కార్డ్ హోల్డర్‌గా రికార్డుల కెక్కింది. అనేక బ్యాంకులు ముంబయి నగరంలో పెద్దవారికి బ్యాంక్‌లో ఎటిఎం కార్డ్ ఉంటే వారి పిల్లలకు ఖాతాలో డబ్బులు వేసుకోవడానికి ఉచితంగా కార్డ్‌లు ఇస్తున్నాయి. ఎబిఎన్ అమ్రో అనే బ్యాంక్ పిల్లలకు కనీస వయస్సు పరిమితి విధించకుండా కార్డులు జారీచేస్తోంది. ఇటీవల రెండు సంవత్సరాల తొమ్మిది మాసాల వయస్సు గల దిషాకు కూడా ఎటిఎం కార్డ్ లభించింది. దీంతో ఆ పసిపాప తన కార్డ్ ద్వారా ఎటిఎంలో డబ్బు డ్రా చేసుకుని చాక్లెట్లు కొనుక్కుంటోందట! తమ బిడ్డ అప్పుడే ఎంత ఎదిగిపోయిందో అనుకుంటూ ఆమె తల్లిదండ్రులు మురిసిపోతున్నారట! తమకు కుప్పలుగా డబ్బుందని చెప్పుకోవడానికి పిల్లలను పాడుచేయాలా?

కంటి నగ

వెర్రి వేషాలు మొదలయ్యేది అమెరికా, యూరప్ దేశాల్లోనే అనేది ప్రతీతి. వెగటు పుట్టించే వేషధారణ, చిత్ర విచిత్రంగా జుత్తు కత్తిరించుకోవడం, విచిత్రమైన నగలు ధరించడం అక్కడి ప్రత్యేకత. తాజాగా మెడకు, చెవులకు ధరించే నగలు కంట్లో ఎందుకు పెట్టుకోరాదనే ఆలోచన డచ్ దేశస్థులకు వచ్చింది. వచ్చిందే తడవుగా దానికి గల అవకాశాలను పరిశోధించి ప్రయోగం చేసి సఫలమయ్యారు. ఇప్పుడు నెదర్‌ల్యాండ్స్‌లో కంట్లో అర్ధ చంద్రాకారం, హృదయం ఆకారం గల మెరుపులతో మెరిసిపోతున్నారట! కంటి తెల్ల గుడ్డుపై 3.5 మి.మీ. వెడల్పు గల ఈ మెరిసే బిళ్ళలను అమర్చుకుని ఆనందిస్తున్నారట. కంటి వైద్యులు కూడా గిరాకి పెరిగిందని సంతోషిస్తున్నారు. చీకట్లో కూడా మెరిసే ఆ బిళ్ళలు ఒకో కంటికి అమర్చడానికి మన రూపాయల్లో సుమారు 52 వేలు అవుతుందట! కంటి వద్ద మత్తుమందు ఇచ్చి 15 నిమిషాల్లో వీటిని అమర్చుతున్నారు. ఇంతవరకు దీనివల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ రాలేదని డాక్టర్లు చెబుతున్నారు.




సిఎం పదవి
కాంగ్రెస్
ప్రమాణస్వీకారానికి ముహూర్తాలు చూసుకుంటున్న రెండు పార్టీలు
దేశం

కార్టూన్ కదంబం


సమాజ్‌వాది పార్టీని చేర్చుకునేది లేదు —ఎన్డీయే
అవసరమయితే మాతోనే కలసిరావాలి —ఎన్డీయే నేతలకు ములాయం సూచన
ములాయం


ఎందుకు మాటిమాటికి తప్పులు చేస్తావ్?
'దేశం' ప్రక్షాళన
నారు

పాప్‌లో మునిగి తేలుతున్న సంగీతం



మానవుల శ్రమలోంచి పుట్టిన సంగీతం ఈ రోజున పాప్, ర్యాప్ సంగీతంగా కోటాను కోట్ల డాలర్ల వ్యాపారమైంది. యువతరాన్ని ఉర్రూతలూగిస్తోంది. మైమరిపిస్తోంది. పబ్‌లలో, డిస్కోథెక్‌లలోకి వెళ్లిన యువత హృదయాలకు 'బగ్'లు బిగించి వారి గుండెలయల వేగాన్ని బట్టి అక్కడక్కడే సంగీతం 'రాపింగ్' చేయటం ఈ క్షణపు నూతన శైలి. ఎం-టీవీ, ఎం.జి.ఎం-మ్యూజిక్, జి-ఇంగ్లీష్, స్టార్-మ్యూజిక్ ఛానెల్స్‌ను మన బుల్లితెర మీదకు తెచ్చుకుచూస్తే... వందలాది మంది మందగా ఊగిపోతుంటారు. సెలెక్ట్ చేసుకున్న కొందరి ఛాతీలపై కార్డ్‌లెస్ బగ్‌లు పెట్టి వాటి ద్వారా వారి హార్ట్‌బీట్స్‌ను గమనిస్తూ ర్యాప్‌మ్యూజిక్ కంపోజర్ ఊగిపోతూ, తూగిపోతూ అప్పటికప్పుడే కంపోజ్ చేయటం కనబడుతుంది. ఇలాంటి సంగీత పోకడలతో 'ది బ్లూస్', ఆఫ్రో-అమెరికన్ సంగీతం "ర్యాప్-ర్యాప్"లు అనేక ఆల్బమ్స్ వరదలా వస్తున్నాయి.

ఉదయ్ శంకర్,
పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

"The vibrations of music affect your heartbeat, blood flow and brainwaves" (సంగీత శబ్దతరంగాలు గుండె లయ మీద, రక్తప్రసరణ మీద, మెదడు తరంగాల మీద ప్రభావం చూపుతుంది.) అని సంగీత కర్త, సంగీత పరిశోధకుడయిన డా॥ ఎస్.హాల్పెర్న్ చెప్పారు. ఇలాంటి పరిశోధకుల విశ్లేషణలను ప్రపంచ మార్కెట్ కొత్త కొత్త పద్ధతుల్లో తన వ్యాపారానికి అన్వయించుకుంటోంది. "The Market is saturated with Rap music" ఈ మార్కెట్టు రాప్ మ్యూజిక్‌తో అన్ని రోజుల్నీ శనివారీకరణ చేసేస్తోంది. లక్క గ్రామ్‌ఫోను రికార్డుల నుంచి, చిన్న ప్లాస్టిక్ రికార్డులు, ఎల్.పి.రికార్డులు, క్యాసెట్లు, సి.డిలుగా హెచ్.ఎం.వి, టిప్స్, సోనీ, టి.డి.కె లాంటి కంపెనీలు వ్యాపారం చేస్తూనే ఉన్నాయి. అయితే ఈ సంగీత శైలులన్నీ వాటి పుట్టుకలో, వ్యాప్తిలో ఎటువంటి కల్మషం లేకుండా ఉన్నాయి. అయితే దేన్నైనా వ్యాపార దృష్టితో, లాభాపేక్షతో చూసే పాశ్చాత్య ప్రపంచం విశ్వవ్యాప్తంగా ఉన్న జానపద బాణీలకు కొంత పైత్యం జోడించి యువతరాన్ని వెర్రెక్కించి, వ్యాపారం చేసుకుంటోంది. ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల యువతఅధికంగా ఇపుడు ఈ సంగీత హోరులోనే మునిగితేలుతున్నారు.

తొలినాటి సంగీత ప్రపంచం:

క్రీ.శ 1600 సంవత్సరం నుండి సాంస్కృతిక పునర్జీవనం అనబడే రీనైజాన్స్ పీరియడ్ అనంతర సంగీత శైలినే వాళ్లకు తొలినాళ్ల సంగీతంగా విశ్లేషకులు అంటున్నారు. 18వ శతాబ్దపు తొలిరోజు వరకు సంగీత కచ్చేరీలుగా బహిరంగ ప్రదేశాల్లోకి ప్రజల ముందుకురాలేదు. మోజార్ట్-హైడిన్ సంగీతకర్తల కాలం నుండీ ముఖ్యంగా బెతోవెన్, ఆయన శిష్య బృందాల కాలం నుండే ప్రజల ముందు సంగీత కచ్చేరీలు సాగాయి. సంగీతం పాడటం నుండి సంగీతాన్ని ప్రదర్శించే రిపర్టీలుగా "ఇంగ్లీషు కెథడ్రల్ కోయర్స్" నుండి ప్రారంభమయ్యాయని తెలుస్తోంది. 1829లో "సెయింట్ మాథ్యూస్ ఫాషన్", మోజార్ట్ - హైడిన్ రిపర్టీ కొత్త కంపోజింగ్‌లతో 'మెస్సయ్యా' సంగీత ప్రదర్శనలను దాదాపు మొట్టమొదటివిగా చెప్పుకోవచ్చు. మన భారతీయ, తెలుగు సంగీతానికొస్తే త్యాగరాజు, అన్నమయ్య తదితర వాగ్గేయకారుల 'తరహా' సంగీతమంతా తీరిగ్గా కూర్చుని పాడేదే. ఇటీవల కాలంలో నిలబడి పాటను ప్రదర్శించడం మొదలైంది. సంగీత విభావర్లు మ్యూజికల్ నైట్లయ్యాయి. అవే సీడీలై ఆల్బమ్‌లై మన ఇళ్ళల్లో ప్రవేశిస్తున్నాయి.

వెస్టర్న్ ఆల్బమ్‌లు : మన ఆల్బమ్‌లపై దాని స్టైలు

1950లలో 'రాక్ ఎన్ రోల్' వెస్టర్న్ మ్యూజిక్‌గా ఊపేసింది. 1970ల నాటికి 'డిస్కో' 1980లలో 'ర్యాప్' మ్యూజిక్‌లు ప్రవేశించాయి. పై సంగీతాలకు తగ్గట్టుగా రాక్ ఎన్ రోల్, బ్రేక్ డ్యాన్స్, అగ్లీ డ్యాన్స్‌లుగా మనం చూస్తున్నాం. సుమారు ఇరవై ఏళ్ల క్రితం తెలుగు హీరో కృష్ణలాంటి వారి కౌబోయ్ సినిమాల్లో కూడా నేపథ్య సంగీతంగా వచ్చిన "కమ్ సెప్టెంబర్" లాంటి వెస్టర్న్ మ్యూజిక్ బిట్స్ ఎల్.పి. రికార్డులుగా వచ్చాయి. అన్నిటీ బంకుల్లో పెట్టేవాళ్లు. అవి యువతరాన్ని ఎంతో

ఆకర్షించాయి. కమ్ సెప్టెంబర్ ఇన్‌స్ట్రుమెంటల్ అంత విస్తృతంగానూ, చాలా బాహాటంగానూ వచ్చిన మొట్టమొదటి ఫోర్నో ఎల్.పీ. రికార్డ్ 'సెర్రాన్'. స్త్రీ, పురుషుల శారీరక కలయిక సందర్భాన్ని, మూలుగుల్నీ మ్యూజిక్ స్టయిల్‌గా మార్చేశారు. అప్పుడు ఆడియో రూపంలోనే వున్న ఈ ధోరణి సీడీలు, ఆల్బమ్ ద్వారా విజువలైజ్ కూడా అయ్యాయి.

పాశ్చాత్య సంగీతం మన యువతరాన్ని వెస్టర్న్ మ్యూజిక్ అభిమానులుగా చేసింది. 'ABBA' అనే నలుగురూ నాలుగు దేశాల యువకులు కలసి రూపొందించిన ఆల్బమ్‌లు. ఈ టీమ్ వారి నాలుగు ప్రదర్శనలను మధ్యలో చిన్న కథ కనెక్టింగ్‌గా అల్లి 'అబ్బా, ది మూవీ' అనే సినిమాగా వచ్చాక వెస్టర్న్ మ్యూజిక్ ఫీవర్ తీవ్రమైంది. అదే రోజుల్లో "ది రోలింగ్ స్టోన్స్", "ది బీస్", "ది బీటిల్స్"... ఇంకా అనేకమైన ఆర్కెస్ట్రాలు వెస్టర్న్ మ్యూజిక్ సామ్రాజ్యాన్ని ఏలాయి. మడోన్నా, మైకేల్ జాక్సన్, సామంతా ఫాక్స్, జానెట్, జెన్నీ లోపేజ్‌లాంటి ప్రపంచ ప్రఖ్యాత పాప్, ర్యాప్ గాయకులు ఒక ఊపు ఊపుతున్నారు. మైకేల్ జాక్సన్ సంగీత ప్రియుల్ని ఎంతగా ఆకట్టుకుంటున్నాడో అంతగా సెక్స్ స్కాండల్స్‌కు, హోమోసెక్స్ నేరాలకు పాల్పడినట్లు వివాదాలకు గురౌతున్నాడు. మడోన్నా అనుకుంటే సమంతా ఫాక్స్, ఈవిడని మించి జెన్ని లోపెజ్‌లు తమ శక్తివంతమైన సంగీతంతోపాటు సెక్స్‌పోజింగ్‌లతో పిచ్చెక్కిస్తున్నారు. దాదాపు ఈ ధోరణులన్నింటికీ గుడ్డి అనుకరణో, ధన దాహమో మనకూ దిగుమతయ్యాయి.

తెలుగు ఆల్బమ్‌లపై వెస్టర్న్ ప్రభావం

"మసక మసక చీకటిలో..." అంటూ విజయవాడకు చెందిన తెలుగమ్మాయి స్మిత ప్రయివేటు ఆల్బమ్ విడుదల చేయడంతో తెలుగులో కూడా ఈ సంస్కృతి పూర్తి స్థాయిలో వ్యాపించడానికి అవకాశం ఏర్పడింది. గాయకుడు పాట మాత్రం పాడితే సరిపోదు. పాటకు అనుగుణంగా నృత్యం చేయాలి. కుర్రకారును హుషారెత్తించాలి. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది గాయనీ గాయకులు తమదైన పంథాలో ఆల్బంలను విడుదల చేస్తున్నారు. భారతదేశంలో కూడా ఎంతో మంది ఈ ప్రక్రియకు ఆస్కారం కల్పించారు. 'వందేమాతరం' అంటూ ఎ.ఆర్.రెహమాన్ రూపొందించిన దేశభక్తి ప్రబోధిత ఆల్బం ఎంతో మంది హృదయాలను కొల్లగొట్టింది.

డిస్కో, బ్రేక్, బ్లూస్, ర్యాప్‌లు ఎవరివి?

జాతిరీత్యా, రంగు రీత్యా ఈ ప్రపంచపు అట్టడుగు పొరల్లోకి నెట్టివేయబడ్డవారు నల్లజాతి వారు. తరతరాలుగా నీగ్రో అనే పదంతో అవమానించారని, అణచివేశారని, తమనిలా పిలవటాన్ని వ్యతిరేకిస్తున్నారు, పురాతత్వ పరిశోధనల ఆధారాల ప్రకారం ఆఫ్రికా ఖండమే ముందుగా నాగరికతలు నేర్చిందని తేలింది. అలాంటి వారి వద్ద 'కాంగో డ్రమ్'లాంటి సంగీత సాధనాలు ఎన్నో వున్నాయి. అ కాంగో డ్రమ్ లయగా డిస్కో సంగీతం ద్వారా, ఏ అవయవానికి ఆ అవయవం నేర్పుగా, లయబద్ధంగా కదల్చగల బ్రేక్ డాన్సు ద్వారా తమను అణచివుంచిన శ్వేత జాతిని వెక్కిరిస్తూ... తిడుతూ... తమ అసహ్యాన్ని, నిరసనను తెలియజేసుకునే అద్భుత కళా సంపదను సృష్టించుకున్నారు. కానీ ఈ రోజున మనం వింటున్న డిస్కో బ్రేక్ సంగీతమంతా అమెరికన్ డాలర్ మార్కెటైజ్డ్ అయ్యాక వికృత రూపాలకొచ్చినవే.

'హాయిరబ్బా'తో తెలుగురంగంలో కాలు బెట్టిన స్మిత ఇప్పుడు మసక మసక చీకటిలో అంటూ యువతరాన్ని వెర్రెక్కిస్తున్నారు. ఈమెబాటలో ఎంతోమంది తెలుగు గాయనీ గాయకులు రంగ ప్రవేశం చేయడానికి తెరతీసినట్లయింది.

ప్రైవేట్ ఆల్బమ్ అంటే ?

ఇంతవరకూ గాయకులు పాడిన పాటలు ఆడియోలో మాత్రమే ప్రత్యక్షం అయ్యేవి. ఇప్పుడు అదే గాయకులు పాటకు అనుగుణంగా నృత్యం చేస్తూ పాట పాడటం కొత్త విధానం. ఈ విధంగా తయారు చేసిన నృత్యగీతం కేసెట్ రూపంలో వస్తే దానిని ఆల్బం అంటారు. ఒక ఆల్బంలో ఒకటి రెండు గీతాలు ఉంటాయి. వీటిని విడుదల చేయడానికి ఎన్నో రికార్డింగు కంపెనీలు రు.లక్షలు ఖర్చు చేస్తున్నాయి. నర్తిస్తూ పాట పాడటాన్ని అందమైన లొకేషన్లలో చిత్రీకరిస్తారు. ఈ పాటకు నృత్య దర్శకత్వం, కెమెరా వంటివి కూడా నిపుణులైన వారు నిర్వర్తిస్తారు. వెరసి దీనిని చూస్తుంటే సినిమాలో పాట చూస్తున్న అనుభూతి కలుగుతుంది. అయితే సినిమా పాటల వెనుక నేపథ్యగానం ఉండగా ఈ ప్రైవేటు ఆల్బంలలో పాటలు పాడిన వారే పాత్రధారులుగా కనిపిస్తారు. ఇలా చిత్రీకరించిన వాటిని మార్కెట్‌లో నేరుగా రికార్డింగ్ కంపెనీలు అమ్ముతుంటాయి. కొన్ని టీవీ చానెళ్ళలో ప్రసారం అవుతుంటాయి. ఇంగ్లీషు ఛానెళ్ళు కొన్ని ప్రత్యేకంగా ఇటువంటివి తామే చిత్రీకరించి ప్రసారం చేస్తుంటాయి. పేరున్న గాయకులు ఎవరైనా ప్రైవేటు ఆల్బం విడుదల చేసినట్లయితే దానికి ఎంతో క్రేజ్ లభిస్తుంది. ఈ ఆల్బంలలో విడుదలయ్యే పాటలన్నీ దాదాపు ఫాస్టుబీటుతోనే ఉంటాయి. ఎక్కువ శాతం యువతరాన్ని ఉద్దేశించినవే అయి ఉంటున్నాయి. చాలా మంది యువతీ యువకులే ఈ ప్రైవేటు ఆల్బంల పట్ల ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు.

ప్రైవేటు ఆల్బంల ప్రవేశం :

'హిందూస్థాన్ గుడియా' పేరుతో హేమసర్‌దేశాయి బాగా ప్రసిద్ధి చెందిన హిందూస్థాన్ గీతాలను విడుదల చేయగా అవి సంచలనం కలిగించాయి. ఇంగ్లీష్ పాప్‌గీతాల మాదిరిగా ఉండటంతో అందరినీ ఆకట్టుకున్నాయి. విదేశాల్లో కూడా ఈ ఆల్బం ప్రసిద్ధి పొంది గ్రాండ్ ఫ్రీ పాప్ మహోత్సవ్‌లో ప్రదర్శింపబడి జర్మనీలో ప్రశంసలు పొందింది. తర్వాత ఇదే బాటలో ఎంతోమంది గాయకులు పయనించారు. అమితాబ్, అరుణా ఇరానీలునటించిన 'బాంబే టు గోవా' అనే హిందీ సినిమాలో ఉషా ఉతప్ ఓ పాప్‌గీతం పాడుతూ తనూగుతూ అందర్నీ ఊగించడం ఒక సన్నివేశంగా ఉంది. సినిమా ద్వారా పాప్‌సంగీతం ఓ ప్రదర్శనా కళగా మన యువతకు పరిచయమైంది. ఆ తర్వాత 1980లలో ఉషా ఉతప్ పాడిన 'లారి తేరి తేరి లారీలో.. పాటతో పాప్‌గీతాల హోరు ప్రైవేటు ఆల్బంల స్థాయిలోకి వచ్చింది. పంజాబ్, హిందీ భాషల కలగలుపుతో పంజాబ్‌కు చెందిన దలేర్ ఆలపించిన గీతాలు కూడా యువతరాన్ని ఆకట్టుకున్నాయి. ఈయన సృష్టించిన భాంగ్రా నృత్యం సంచనలం కలిగించడంతో సుఖ్‌బీర్‌సింగ్, మిక్కా వంటి వారు కూడా కేసెట్లు వెలువరిచండంలో ముందుకు వచ్చారు. సినీ నేపథ్య గాయకుడు శంకర మహదేవన్ 'తేరే ఖయాలో మే' అంటూ ఊపిరి తీసుకోకుండాపాడిన పాట ఎంతోమందిని ఆకట్టుకుంది. ప్రైవేటు ఆల్బంలో ఈ పాట చిత్రీకరణలో పాట పూర్తయిన తర్వాత గాయకుడు ఊపిరి తీసుకునే సన్నివేశం చివరలో చూపించడం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఫల్గుణి పథక్ గానం చేసిన 'యాద్ పియాకీ ఆనే లగీ' అనే ఆల్బం కూడా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించింది. "మైనే పాయల్ హై ఛాంకియా", "మేరీ చునర్ ఉడ్-ఉడ్ జాయే" "సవరియా తేరీయాద్ మే", "ఏ కిస్నే జాదూ కియా" ఆల్బమ్‌లు కూడా బాగా

శంకర్ మహదేవన్

దలేర్ మెహందీ

హిట్ అయ్యాయి. రాగేశ్వరి ఆలపించిన దునియా కూడా చెప్పుకోదగ్గ ప్రాచుర్యాన్ని సంపాదించింది. పూర్తిగా మెడోన్నాను అనుకరిస్తూ నటభైరవి రాగంలో - ఆలీషా చినాయ్ రూపొందించిన 'మేడిన్ ఇండియా' ఆల్బం కూడా ఎంతో అమ్మకాలు జరుపుకుంది. 'కొలోనియల్ కజిన్స్' పేరుతో ప్రసిద్ధి చెందిన జంట గాయకులు 'సనిదప మగా మాగరిస' అనే గీతాలు కూడా కట్టుకున్నాయి. ఒకరి నుంచి మరొకరికి ఆల్బంల సంస్కృతి వ్యాపించడంతో చాలామంది వీటి రూపకల్పనలో ఉత్సాహం చూపిస్తున్నారు.

ఆల్బంల రూపకల్పనలో పోటీ :

ఆల్బంలు రూపొందించడంలో సౌలభ్యం వీటికి లభిస్తున్న ఆదరణ కారణంగా చాలా మంది వీటి తయారీకి ముందుకు వస్తున్నారు. ఫల్గుణీ పథక్ 'యాద్ పియాకీ ఆన్ లగీ' అనే గీతం ఆధారంగా వివిధ బాణీలతో ఎన్నో కాసెట్లు విడుదలయ్యాయి. సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహమాన్ వందేమాతరం... మాతుజే సలాం అంటూ దేశమాత గొప్పతనాన్ని కీర్తించారు. ఉదిత్ నారాయణ్, కుమార్ సాను ఇతరులకు పోటీగా ప్రైవేటు ఆల్బంలను రూపొందించారు. హిందీ సినీ హీరో ఒక ప్రైవేటు ఆల్బంను తయారు చేసి విడుదల చేశారు. బాబా సెహగల్ 'ఠండా ఠండా పానీ', రియెూ ఫెర్నాండెజ్ రూపొందించిన 'ప్యాక్ దట్ స్మోక్' దలేర్ మెహిందీ తయారు చేసిన 'హో జాయేగా భల్లే భల్లే గీతాలు. పోటీలు పడిన ప్రైవేటు ఆల్బంలుగా విడుదల చేశారు. ఛానెల్స్‌లో ప్రసారం చేయడంతో వీటి తయారీలో చాలా మంది గాయనీ గాయకులు పోటీ పడి ముందుకు వచ్చారు. బాబాసెహెగల్, ఈషాకప్పికర్, డోలారే డోలారే ఫేం శ్రీయాగోషాల్, సునిధీ చౌహాన్, షక్బీర్, శ్రీకాంత్, డి.జే.అక్వీనా, రమోనా, బాబుల్ సోప్రియా, శశ్వతా అనూషా, మైకాలాంటి వారు బాగా ప్రాచుర్యంలో వున్నారు.

ఈ ఆల్బంలలో నటించేవారి దుస్తులు హావభావాలు, చిత్రీకరణ జరిగే ప్రదేశాల విషయంలో కూడా ఒకరికన్నా మరొకరు భిన్నంగా రూపొందించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గాయకుల్లో దలేర్ మెహందీ, ఆశాభోంస్లే, కొలొని కజిన్స్ వంటి వారు కాస్త హుందా అయిన దుస్తులతో కనిపిస్తుంటారు. పెద్ద బొట్టు, సాంప్రదాయక చీరకట్టుతో ఉషా ఉతుప్ వంటి వారు దర్శనమిస్తుండగా యువతరాన్ని ఆకర్షించడానికి రెచ్చగొట్టే దుస్తులతో దర్శనమిస్తున్న వారూ ఉన్నారు. 'దీవానాతో దీవానా' అనే ఆల్బంలో శ్వేతా శెట్టి రెచ్చగొట్టే విధంగా అవయవాలను ప్రదర్శించారన్న విమర్శలు వచ్చాయి. శశ్వతా-అనూషా గ్రూప్ వేదికపై ప్రవేశమే ఎఫ్-టి.వి., ట్రెండ్జ టీవీ లెవెల్లో అసభ్యంగా ఉంటుంది. కోమలి రూపొందించిన 'బాపూజీ' అనే ఆల్బంలో అరకొర దుస్తులతో శరీర భాగాలను పదేపదే చూపించారు. ఈ ఆల్బం చిత్రీకరణ కూడా ఇదే విధంగా కొనసాగింది. రియెూ ఫెర్నాండెజ్ రూపొందించిన ఓ మేరి మున్నీ' అనే ఆల్బం టీనేజర్ల సెక్సుకు సంబంధించినది. పోటీని తట్టుకోవడానికి అమ్మకాలను పెంచుకోవడానికి కొంతమంది ఆల్బంల రూపకల్పనలో అనారోగ్యకరమైన పోటీని సృష్టిస్తున్నారు.

లక్షల్లో వ్యయం :

ప్రైవేటు ఆల్బంను రూపొందించడానికి వివిధ కంపెనీలు లక్షల్లో వ్యయం చేస్తున్నాయి. కేవలం ఒక పాట చిత్రీకరణకు రు.10 లక్షల నుంచి రు.30 లక్షల వరకూ వ్యయం చేస్తున్నారంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. ఎంత పెట్టుబడి పెట్టినా లాభాలు కూడా ఆ విధంగానే వస్తున్నాయి. ఆల్బంలను రూపకల్పన చేయడంలో మొదట 'మాగ్నా సౌండ్' ఆడియో కంపెనీ ముందుకు వచ్చింది. 1988లో ఆలీషా చినాయ్‌తో బేబీడాల్' అనే ఆల్బం కేసెట్‌ను విడుదల చేసింది. మైకేల్ జాక్సన్, జానెట్ జాక్సన్, సమంతాపాక్స్ వంటి వారి భారీ ఆల్బంలు విపరీతంగా విడుదల చేసి లాభాలను మూటగట్టుకుంది. అనురాగ్ కాశ్యప్, మహేష్ ముత్తయ్య, రాధికారావు, కునాల్ కోహ్లీ వంటి యువ దర్శకులతో ఆల్బంలు రూపొందించడానికి ఎన్నో కంపెనీలు లక్షలాది రూపాయలను వ్యయం చేస్తున్నాయి. ఉత్తరాదిలో జానపద పాప్ సంగీతానికి ఎంతో ఆదరణ ఉంది. మడోనాతో రూపొందించిన 'రే ఆఫ్ లైట్' 'ఆక్వా' స్పేస్ గర్ల్స్ వంటి ఆల్బంలు విపరీతంగా అమ్ముడు పోతున్నాయి. గుల్షన్ కుమార్ అనురాధా పొడ్వాల్‌తో భక్తి గీతాలు పాడించి ఆల్బంల అమ్మకాల్లో రికార్డులు సాధించారు. అమ్మకాలకు అనుగుణంగా గాయకులకు కూడా పారితోషికాలు లభిస్తున్నాయి. పంజాబీ జానపద గీతాలను కొత్త పద్ధతి నృత్యంతో పాడే దలేర్ మెహందీకి ఒకప్పుడు నామమాత్రపు పారితోషికం లభించేది. అతనితో మాగ్నాసౌండ్ కంపెనీ రు.2.75 కోట్లతో ఆల్బంల రూపకల్పనకు కుదుర్చుకున్న ఒప్పందం పారిశ్రామిక వర్గాలను కూడా ఆశ్చర్యంలో ముంచెత్తింది. బి.ఎం.జి., క్రిసెండో, సోనీ, మైల్‌స్టోన్, హెచ్.ఎం.వి. పాలిగ్రామ్ వంటి సంస్థలు నూతన గాయకులను ప్రోత్సహిస్తున్నాయి.

ఆల్బంల వెల్లువ :

ఒకప్పుడు రాక్ సంగీతం ఉధృతంగా ఉండేది. ఇప్పుడు పాప్ సంగీతం ప్రైవేట్ ఆల్బంల ద్వారా ఉధృతంగా వెలువడుతోంది. వీటి తయారీ రూపకల్పన హిందీలోనే ఎక్కువగా ఉంది. ప్రాంతీయ భాషల్లో రూపొందించినా తగిన మార్కెట్టు ఆదరణ లేకపోవడం వల్ల అంతగా రావడం లేదు. గతంలో ఒకటి రెండు వచ్చినా అవి ఆదరణ పొందలేదు. దక్షిణాది రాష్ట్రాల్లో శాస్త్రీయ సంగీతం, కర్ణాటక సంగీతాల పట్ల ప్రజల్లో ఉన్న మక్కువ కారణంగా స్పీడుగా ఉండే ఈ ఆల్బంలు ఆదరణ పొందలేక పోయాయని కొందరి వాదన. హిందీపాటలకు కొత్త బాణీలు కట్టడం ప్రస్తుతం ఫ్యాషన్‌గా తయారైంది. తెలుగులో ఎల్.ఆర్.ఈశ్వరి గానం చేసిన 'మసక మసక చీకటిలో' అనే పాట పాప్‌గీతంగా స్మిత గానం చేయడంతో తెలుగు పాప్‌గీతాలకు మళ్ళీ ఆదరణ లభించినట్లయింది. ఈ సంప్రదాయం కొనసాగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. 'ఈ ఆల్బం తెలుగులో కొత్త సంప్రదాయానికి నాంది!" అని స్మిత ఇటీవల ఒక ఇంటర్వ్యూలో వెల్లడించాను. ★

బ్లూస్ సంగీతం

"బ్లూ" (Blue) అనే పదాన్ని డిక్షనరీ అర్థం ప్రకారం రంగుకి చెందిన పదంగానే కాక మానసిక శాస్త్రంలో "మెలన్ కోలియా" స్థితి లేదా డిప్రెషన్ స్థితికి సంకేతపదం. ఈ పేరుతో వున్న సంగీత శైలి "బ్లూస్", ఆఫ్రికా బానిసలు తమ వేదనా రోదనలు వ్యక్తపరుచుకొనేందుకు తమదైన ఒకానొక శైలి. నల్లజాతి శ్రామిక మహిళలు, పురుషులు "నిమ్నజాతి వ్యక్తీకరణా కళా ప్రక్రియగా" రూపొందించుకున్నది. బానిసలైన ఈ పని వారు తమ మనస్సుల్లోకి ఆ క్షణాన ఏం వస్తే దాన్నే ఓ రాగంలో ఆశువుగా పాడుకుంటారు. ఇది హృదయంలోంచి నిఖార్సయిన, నిజాయితీగా వెలువడే ఒక వ్యక్తీకరణ, ఒక భావావేశం మాత్రమే తప్ప అది సంగీతం కాదు అని కొందరంటారు. ఆఫ్రికా నల్లజాతి వారి ఈ కళా వ్యక్తీకరణా పద్ధతినీ 'మార్కెట్' వదల్లేదు. వదలదు. రాబర్ట్ జాన్సన్, మైల్స్ డేవీస్, చార్లెస్ పాటన్, లెప్ జెప్పెలిన్, ఎర్రిక్ క్లాప్టన్, జెమీ హెండ్రిక్స్, జెమ్మీ పేజ్‌లాంటి కళాకారులు "మడ్డీ వాటర్స్", "రెడ్ హాట్ చిల్లీస్"లాంటి ఆర్కెస్ట్రా ట్రూప్స్ ఈ బ్లూస్ సంగీతాన్ని వాయితీస్తున్నారు.

“రాప్” హోరు

ర్యాప్ సంగీతానికి వేర్లూ, పునాది ఆఫ్రికా నల్లజాతి వారి "మైనార్టీ మ్యూజిక్ జెన్రె"లోనే ఉన్నాయి. కానీ ఇప్పుడది ప్రపంచ ప్రఖ్యాతిచెంది, "ఆఫ్రో-అమెరికన్ పాప్ మ్యూజిక్"గా వెలుగొందుతోంది. నల్లజాతి వారి హృదయ స్పందనల ఈ "ర్యాప్"ను కూడా "ఇదొక సంగీతం కాదు. ఒకానొక కాలానికొచ్చిన చిరాకులకు, తమను అవమానించారనే దుగ్ధలకు ఓ వెర్రిప్రేలాపనా భావావేశాలు మాత్రమే"నని ఆరోపించిన వారున్నారు. ఇది వీధిమూలల నుంచి మొదలైంది. 1982లో 'ది మెసేజ్' అనే ఆల్బమ్‌ను గ్రాండ్ మాస్టర్ ఫ్లాష్ ద్వారా "ర్యాప్" సంగీతం వెలుగులోకి వచ్చింది. డీజేస్ ఆర్కెస్ట్రా బృందం ఈ ర్యాప్‌తో వెర్రెక్కిస్తోంది. ఒక ఇన్‌స్ట్రుమెంట్ మ్యూజిక్ బీట్, ఒక రిథమ్ కంటిన్యూగా వస్తూ ఉంటుంది. ఆ లయలో వచన రూపంలో దాదాపు ఆశువుగా రకరకాల గొంతుల్లో వస్తూ ఉంటుంది. ఇమినెమ్, ఎల్.ఎల్.కూల్‌లతోపాటు రాప్ మహిళామణులు సాల్ట్-ఎన్-పెపా, క్వీన్ లతీఫా, లీయిల్ ఎల్ లాంటి వారు ఈ ర్యాప్‌తో ఓలలాడిస్తున్నారు.

ఎయిర్‌పోర్ట్

యింజమూరి వెంకట బాలాజీ

సాయంత్రం అయిదవుతోంది.

చలికాలం కావడంతో మెల్లగా చీకట్లు కమ్ముకుంటున్నాయి.

చలిగాలి కూడా బాగా వీస్తోంది.

కూలి పనులకెళ్ళిన వాళ్ళూ, పొలాలకు వెళ్ళిన వాళ్ళూ ఒక్కొక్కళ్ళే ఇళ్ళకు చేరుతున్నారు.

పిల్లలు అరుపులు, ఆటలతో, కుక్కల కాట్లాటలతో ఆ వీధి హోరెత్తుతోంది.

రోడ్లపై ఆడే పిల్లలు గానీ, ఇళ్లకు చేరుతున్న పెద్ద వాళ్ళు గాని ఎవరి ముఖాల్లో జీవకళ లేదు. అందరూ బక్కచిక్కిన మనుషులే...

అక్కడి పూరిపాకలు, కళా కాంతులు లేని మనుషుల ముఖాలు చూస్తేనే ఆ ఊరి పరిస్థితి అర్థమవుతుంది..

ఇనండొహో.........

ఊళ్ళోని జనమంతా...... రైతులూ....

అందరూ రేపు మధ్యాహ్నం 12 గంటలకు పంచాయితీ కార్యాలయం దగ్గరకు రావాలి.. విమానాశ్రయం వల్ల పొలాలు నష్టపోయేవారికి నష్టపరిహారం ఇస్తారొహో... ఇళ్ళు కోల్పోయేవారికి వేరేచోట ఇళ్ళు కట్టిస్తారొహో..... అందరూ ఇనండొహో...... రాములు నోరు నొప్పి పెట్టేవరకు దండోరా వేసి వెళ్ళిపోయాడు...

* * *

అదొక శివారు గ్రామం. హైదరాబాద్ నగరానికి ఇరవై ఐదు కిలోమీటర్ల దూరాన బెంగుళూరు హైవే పక్కన ఉంది.

ఎన్నడో డెబ్బయి ఏళ్ళ క్రితం ఆ గ్రామం ఏర్పడింది. రాష్ట్రంలో బక్కచిక్కి ఎండిపోయిన, వలసపోయిన పల్లెల్లో అదీ ఒకటి...

అక్కడ వందకు పైగా ఇళ్ళు ఉంటాయి. ఊర్లో సగం మంది రైతులు. అయితే అంతా సన్న, చిన్నకారు రైతులే. అర ఎకరం నుండి ఐదెకరాల వరకు భూములు గలవారు. చాలామంది ఉన్న కొద్దిపాటి భూమిని అమ్ముకుని వచ్చిన డబ్బులు తీసుకుని పట్నానికి వలసపోయారు. మరికొందరు ఇక్కడ బతకడానికి పనులు దొరక్క పొట్ట చేతపట్టుకుని పోయారు. ఆ పొలాలకు ఎటువంటి నీటి వసతి లేదు. పుట్టిన చోటల్లా అప్పులు చేసి కొందరు బోర్లు వేయించుకున్నారు. మంచి జియాలజిస్ట్ దొరికి అదృష్టం బాగున్నవారికి నీరు పడింది. మోసపోయిన వారికి డబ్బు వదిలింది-నీరు పడలేదు- అప్పు మాత్రం కొండలాగా పెరిగిపోతోంది. భూములున్న వారిలో

సగం మందికి పట్టాలు లేవు. ఎప్పటి నుండో చెలకలు బాగు చేసుకుని వాన దేవుడిపై భారం వేసి నాలుగు గింజలు పండించుకుంటున్నారు. అసలు భూమి లేనివారిలో ఎక్కువమంది వ్యవసాయ కూలీలే. ఇతరత్రా వృత్తులేమీ ఆ గ్రామంలో పెద్దగా లేవు. చుట్టుపక్కల గ్రామాల్లో పొలం పనులు, ద్రాక్ష తోటల్లో, లేదా ఇళ్ళ నిర్మాణ పనులు చేసుకుని బతికేస్తున్నారు. రైతులుగా చెప్పుకునే వారి పరిస్థితి కూడా ఇంతకంటే గొప్పగా ఏమీ లేదు. వరుణ దేవుడు కరుణించినా పండే నాలుగు గింజలూ ఏడాది పొడవునా సరిపోవు.. నాలుగువేళ్ళు నోట్లోకి వెళ్ళాలంటే ఇంటిల్లిపాదీ ఏదో ఒక కూలికెళ్ళాల్సిందే. తినో తినకో గుడిసెలో పడుండే ఆ పేదోళ్ళందరికీ ఇపుడొక సమస్య వచ్చి పడింది.

అదే విమానాశ్రయ నిర్మాణం.. అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం కోసం ఈ చుట్టుపక్కల ఐదు వేల ఎకరాల భూమి సేకరిస్తున్నారు. అందులో ప్రభుత్వ బంజర్లున్నాయి. ప్రయివేటు భూములూ ఉన్నాయి. ఎన్నో ఏళ్ళుగా వ్యవసాయం చేసుకుంటున్నా కూడా ఆ ఎకరా, అర ఎకరాకు పట్టా లేని పేద రైతులు చాలా మంది ఉన్నారు. వారి భూములు కూడా ప్రభుత్వ బంజర్ల లెక్కలోకే వెళ్ళిపోయాయి.

సూటూ బూటూ వేసుకుని తిరిగే దొర బాబుల కోసం తమ ఇళ్ళూ, పొలాలు పోతాయని తెలిసిన దగ్గర్నుండీ ఆ ఊళ్ళో ఎవరి కంటికీ కునుకు లేదు.



భూములకు సర్కార్ ఇచ్చే ధర చాలా తక్కువ. అదీ పట్టాలున్నవారికే నష్టపరిహారం ఇస్తారు. పట్టా లేని వారికి ఏమీ లేదు. ఇళ్ళు పోయినవారందరికీ ఎక్కడో దూరంగా ఇళ్ళు మాత్రం కట్టి ఇస్తున్నారు. విమానాశ్రయం వల్ల సర్వస్వం కోల్పోయే వారు గుండెలు పగిలేలా ఏడుస్తుంటే ఆ ఐదు వేల ఎకరాల చుట్టూ గల గ్రామాల పరిస్థితి ఇంకోలా ఉంది.

విమానాశ్రయం పేరు వినగానే ఎక్కడెక్కడి నుండో స్థలాల బ్రోకర్లు రాబందుల్లా ఆ ఊళ్ళపై వాలారు. పొలాలు కోల్పోయే వారికి ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారానికంటే రెట్టింపు ధరలు ఇచ్చి కొనేశారు. ఆ ఊళ్ళలో పుట్టి పెరిగిన వారిని అక్కడి నుండి తరిమేశారు.

ఆ తర్వాత...

అక్కడి భూములకు రెక్కలు వచ్చాయి. ధరలు చుక్కల్లో కెళ్ళి తొంగి చూస్తున్నాయి. అప్పటి వరకు రకరకాల పంటలు పండే నేలలు, బీళ్ళు అన్నీ ఇళ్ళ స్థలాలుగా, ఫార్మ్ హవుజ్‌లుగా మారిపోయాయి. స్థలాలు కొన్న బ్రోకర్లు కోటీశ్వరులైపోయారు. నగరం నుండి డబ్బున్నవారు, మధ్య తరగతివారు (వీరంతా ఒకనాడు పల్లెల నుండి పట్నాలకు వచ్చినవారే. పట్టణాలు కిక్కిరిసిపోవడంతో చుట్టుపక్కల పల్లెల్ని పట్నవాసులు మింగేస్తున్నారు) ఆ పల్లెలను ఆక్రమించుకున్నారు. పల్లె ప్రజలు మరింత దూరంగా... ఈ పట్నవాసులకు కనిపించనంత దూరంగా జరిగిపోయారు. ఇది జరుగుతున్న కథ...

* * *

చీకట్లు ముసురుతున్న వేళ మళ్ళా ఆ శివారు గ్రామంలోకి వస్తే...

చీకటి ఊరిని పూర్తిగా ఆక్రమించింది.. చలిగాలి రివ్వున వీస్తోంది... ఇళ్ళన్నీ చిన్నా చితకవీ కావడంతో అంతటా శీతలం కమ్ముతోంది...

పొద్దంతా పొలంలో పనిచేసి అప్పుడే ఇంటికి వచ్చిన మల్లేశు వాకిట్లో కుక్కి మంచం వేసుకుని నడుం వాల్చాడు.. రాములు నోరు పోయేదాకా వేసిన దండోరా విని ఉలిక్కిపడ్డాడు.

అయిపోయింది.. అంతా అయిపోయింది... అనుకున్నాడు. ఇక పిల్ల పెళ్ళి చేయలేను, నేనింక ఈ సంసారాన్ని పోషించలేననుకుంటూ కుమిలిపోతున్నాడు.

విమానాశ్రయం కడతామని సర్కారోళ్ళు చెప్పి మూడేళ్ళయింది. ఇక అప్పట్నుంచి ఊళ్ళో వ్యవసాయం పనులు బంద్ అయిపోయాయి. ఏళ్ల తరబడి రెక్కలు ముక్కలు చేసుకుని చెలకలు బాగుచేసుకున్నారు. బోర్ వేయించి పొలం మంచిగా పండించుకుందామని మల్లేశు లాగా చాలామంది ఆశపడ్డారు. బోర్ కోసం అప్పు చేద్దామని అనుకున్నారు. అప్పివ్వడానికి ఒక ఆసామి ముందుకు వచ్చాడు కూడా. ఇంతలో మిడివేళంగా విమానాశ్రయం ప్రకటన వచ్చి పడింది. ఆ ఊళ్ళో అందరికీ పిడుగులు పడినట్లయింది. పట్టాలున్న రైతులకు పొలాలకు నష్టపరిహారం ఇస్తారు. పట్టాలు లేని వారికి ఎటువంటి నష్టపరిహారం ఇచ్చేది లేదని కలెక్టర్ గారు ప్రకటించారు.

ఈ ప్రకటన రావడంతో బోర్ వేయడానికి అప్పిస్తానని చెప్పిన ఆసామి పత్తా లేడు. ఏదో నాలుగు వాన చినుకులు పడితే నాలుగు బస్తాలు పండుతున్నాయి. అక్కడక్కడా కూలి చేసుకుని రోజులు నెట్టుకొస్తున్నారు. తను, భార్య లక్ష్మి, కూతురు అమ్ములు, కొడుకు కోటేశు సహా కుటుంబమంతా రెక్కలు ముక్కలు చేసుకుని చెలక బాగు చేసుకున్నారు. ఒకనాడు ఎందుకూ పనికిరాని భూమిని సాగుకు పనికివచ్చేలా తయారు చేశారు. సొంత బిడ్డను చూసినట్లు చూసుకుంటున్నారు. అందులో కొంత భూమిని బిడ్డకు కట్నంగా ఇచ్చి పెళ్ళి చేద్దామని మల్లేశు అనుకున్నాడు. ఇపుడు అంతా నాశనం, సర్వ నాశనం అయిపోయింది. మల్లేశు కుక్కి మంచంలో లేవలేకుండా అలా నిర్జీవంగా పడి ఉన్నాడు. చలిగాలి శరీరాన్ని వణికిస్తున్నా మల్లేశుకు చెమటలు పడుతున్నాయి. అంతా అంధకారంగా ఉంది. ఆ ఊరికి వెలుగే లేదు. రేయింబవళ్ళు అందరూ కష్టపడి బాగుచేసుకున్న పొలం సర్కారోళ్ళ చేతిలోకి పోతోంది. తన పొలాన్ని ప్రభుత్వ బంజరుగా ప్రకటించేశారు. నష్టపరిహారంగా పైసా కూడా ఇవ్వకుండా భూమిని లాక్కుపోతున్నారు. ఇక ఎలా బతకాలి?



ఎక్కడో దూరంగా ఇళ్ళు కట్టిస్తారట. అక్కడ పనులు ఏమి ఉంటాయి. సిటీకి పోవాలి. సిటీలో ఎక్కడుండాలి? తనకు చెలకలు బాగుచేయడం, పొలం పనిచేయడం తప్ప ఏం తెలుసు? ఎప్పుడైనా సిటీ ముఖం చూసాడా? రేపు పంచాయితీ ఆఫీసుకాడ పట్టాలున్న వాళ్ళందరికీ నష్టపరిహారం ఇస్తారు. తనకేమి ఇస్తారు? ఊరొదిలి వెళ్ళిపొమ్మని నోటీసులిచ్చారు. తను బాగుచేసుకున్న చెలకకు పట్టా ఎందుకు ఇవ్వలేదు? ఇస్తామని నాలుగేళ్ళ నుండి [illegible]న్నారు. అప్పుడెప్పుడో మంత్రి గారు వచ్చినపుడు కూడా సర్పంచ్ పట్టాల గురించి చెప్పాడు. త్వరలో ఇస్తామని మంత్రిగారు హామీ ఇచ్చారు. మళ్ళీ ఆ మంత్రి వస్తాలేదు. ఇంతలో ఇది ముంచుకొచ్చింది. అయినా ఈ విమానాశ్రయం కడితే మాకు ఏం ఒరుగుద్ది? ఇళ్ళ మీదుగా ఎగిరే విమానాలు చూసి పిల్లలు [illegible] ఒకరి బాగుకోసం మరొకరిని నాశనం చేయడమేనా?

ఇంత బాధలో, దుఃఖంలో మల్లేశుకు చిన్నపుడు తన తాత చెప్పిన గండిపేట చెరువు కథ గుర్తుకొచ్చింది. అవును ఒకరు సుఖపడాలంటే మరొకరు నాశనం కావాల్సిందే. బలవంతులు బలహీనుల్ని అంతం చేయాల్సిందే. ఈ లోకం ఇంతే. ఇది మారదు.

లేకుంటే ఏమిటి? గండిపేటలో ఉండే తన తాత అక్కడ చెరువు తవ్వడం కోసం ఊరు వదిలి పోవాల్సి వచ్చింది. అక్కడి వాళ్ళందరినీ పాతిక కిలోమీటర్ల దూరానికి తరిమేశాడు నిజాం నవాబు. హైదరాబాద్ నగరంలో నివసించేవారికి మంచినీళ్ల కోసం చెరువు తవ్వించడానికి అనేక ఊళ్ళు ఖాళీ చేయించాడు. అందరినీ బలవంతంగా గెంటేశారు. మూడు తరాలు గడిచిపోయాయి. ఇక్కడే చెలకలు బాగుచేసుకుని పండిందేదో తిని బతుకుతున్నారు. కొందరి భూములకు సర్కార్ వాళ్ళు పట్టాలిచ్చారు. కొందరికి రాలేదు. కుటుంబాలు పెరిగాయి. ఉమ్మడి కుటుంబాలు చీలిపోయాయి. తరాలు మారాయి. నగరం దగ్గరైంది. బస్సులు తిరుగుతున్నాయి. కొందరు కూరగాయలు, పూలు వేస్తున్నారు. నోరుండి, తెలివైనవాళ్ళు బోర్లు వేసుకుని వ్యవసాయం ద్వారా బాగుపడ్డారు. పిల్లల్ని చదివించుకున్నారు. మరికొందరు నగరానికి వెళ్లి ఏదో పనిచేసుకుని జీవిస్తున్నారు.

మల్లేశు లాంటి చదువు లేనివాళ్లు వేరే ఆధారం లేక ఈ ఊళ్ళోనే బతుకుతున్నారు. తనకీ అక్షరం ముక్క రాదు. పిల్లలను కూడా చదివించుకోలేదు. పంతులు గారు ఇల్లిల్లు తిరిగి పిల్లలను బడికి పంపించమని మొత్తుకున్నాడు. మధ్యాహ్నం భోజనం పెడతారన్నాడు. తను మాత్రం అవేమీ వినలేదు. బడికి పంపిస్తే ఏమొస్తది, ఏదో పనిచేసుకుని నాలుగు రాళ్ళు తెస్తే అందరికీ ఉపయోగపడుతుందని అనుకున్నాడు. అందుకే తన కొడుకు కూడా తన లాగా కూలోడుగా మారాడు.



అందరూ కలిసి రెక్కలు ముక్కలు చేసుకున్నారు. చెలకలోని కంపలు తీసేశారు, రాళ్లు పగలగొట్టారు. అంతా బాగుచేసుకుని బోర్ వేయించుకుందామని అనుకుంటున్నారు. పని చేసి చేసి అరికాళ్లు వాచిపోయాయి. చేతులు కాయలు కాచాయి. ఇక ఇబ్బంది లేకుండా మూడు పూట్లా నాలుగు మెతుకులు తినవచ్చునుకుని ఆశపడ్డారు. ఈ విధంగా ఆరుగాలం కష్టపడి చెలకలు బాగుచేసుకున్న మల్లేశు లాంటి వాళ్ళు చాలామంది ఉన్నారు. ఇప్పుడు వాళ్ళంతా ఏం కావాలి? డెబ్బయి ఏళ్ల నాడు మంచినీళ్ళ చెరువు కోసం అనేక గ్రామాలు ఖాళీ అయ్యాయి. భాగ్యనగరం కోసం అమాయక గ్రామీణుల జీవితాలు అల్లకల్లోలం చేశారు. మళ్ళా ఇన్నాళ్లకు కొద్ది కొద్దిగా బాగు పడుతున్న ఆ పల్లె ప్రజలు, ఈసారి కూడా భాగ్యనగరం కోసమే, మళ్ళీ ఈ నగరవాసుల కోసమే, తమ నెత్తినెక్కి ఆడించేవారి కోసమే, తెల్లబట్టలేసుకునే దొరల కోసమే ఊళ్లను నాశనం చేస్తున్నారు. రైతులను పొలాల నుండి దూరం చేస్తున్నారు. ఎకరం పొలం ఉన్న రైతు తనకు వచ్చే డబ్బుతో ఎలా బతుకుతాడు? పొలం పని తప్ప మరేమీ తెలియని ఆ రైతు కుటుంబ పరిస్థితి ఏమిటి?

అసలు పట్టా లేని మల్లేశు లాంటి వారి పరిస్థితి ఏమిటి? వీళ్ళంతా ఏమికావాలి? పల్లెల్ని ఖాళీచేసి, వాళ్ళ జీవితాలతో ఆడుకునే హక్కు వీళ్ళకు ఎవరిచ్చారు? మల్లేశు జ్ఞాపకాల నుండి బయట పడ్డాడు. మల్లేశు చదువుకోకపోయినా ఎంతో కొంత లోకజ్ఞానం ఉంది. నలుగురికీ సాయపడే మనసు ఉంది. కాని వ్యవసాయం, చెలక బాగుచేయడం మినహా మరేపనీ చేతకానివాడు. రేపటిపై ఆశతో ఇంతవరకు బతుకు బండి నెట్టుకొచ్చాడు. ఇప్పుడు ఆ బండిచక్రాలు విరిగిపోయాయి. ఇక కదలదు. ఉన్న ఒక్క ఆధారం పోయింది. పుట్టి పెరిగిన తల్లి లాంటి వూరిని వదిలి వెళ్లిపోవాలి. వెళ్ళి పోయి ఏం చేయాలి? ఎలా బతకాలి? కూతురు పెళ్ళి ఎలా చేయాలి? కొడుకు భవిష్యత్ ఏమిటి? ఈ ఆలోచన రావడంతో మరలా మల్లేశుకు చమటలు పట్టాయి. వాకిట్లో వేపచెట్టు నుండి చలిగాలి రివ్వున వీస్తోంది. అయినా మల్లేశు చెమట్లు ఆరడం లేదు.

"నాన్నా అమ్మ పిలుస్తోంది లోపలికి రా" అంటూ కోటేశు కేక వేశాడు.

ఆ కేకతో లేద్దామని మల్లేశు ప్రయత్నించాడు. కాని లేవలేకపోతున్నాడు. అతి కష్టం మీద కుక్కి మంచంలో నుండి లేవగలిగాడు. అప్పటికి చలి తెలిసింది. వణుకు పుడుతోంది. శరీరంలో నిస్సత్తువ ఆవరించింది. కళ్ళు బైర్లు కమ్మాయి. ఇక ఇంట్లోకి వెళదామని అనుకున్నాడు. గుమ్మం వైపుగా రెండడుగులు వేశాడు. కుప్పకూలిపోయాడు. పుట్టిపెరిగిన ఊరిని వదలలేక భవిష్యత్ అంధకారమై ఏమి చేయాలో తెలియని మల్లేశును ఆ మట్టి తనలో కలిపేసుకుంది. ఆ భూమిపుత్రుడి ఊపిరి ఆగిపోయింది.

"నాన్నా" అరుస్తూ కోటేశు పరుగెత్తుకు వచ్చాడు. నాన్నను లేపి ఇంట్లోకి తీసుకువెళదామని చేయిపట్టుకున్నాడు. చలనం లేకపోయేసరికి స్థాణువైపోయాడు. అమ్మా... అని బిగ్గరగా అరుస్తూ తల్లిని పిలిచాడు....

ఒక మల్లేశు మట్టిలో కలిసిపోయాడు. ఇటువంటి వారెందరో? నవనాగరీకుల కోసం పల్లెలు నాశనమవుతున్నాయి. పల్లె ప్రజలు దిక్కులేని అనాధలవుతున్నారు. ఈ పాలకులు నగరాలకేనా? నోరున్నవాళ్ళకు, బలవంతులకేనా? అమాయకులు, నోరులేని పల్లె ప్రజలు ప్రజలు కారా? ★

సాయపడే చేతులు

పుప్పాల కృష్ణమూర్తి

ఒక అడవిలో ఓ ఏనుగు వుంది. దానికి భర్త, పిల్లలు వున్నారు. స్వంత ఇల్లు కూడా వుంది. కానీ అది చాలా స్వార్థపరురాలు. అడవిలో దొరికిన పండ్లు, కాయలు... అన్నిటినీ తన ఇంట్లోనే దాచుకునేది. ఆకలితో బాధపడుతున్న జంతువులను చూస్తూ వుండేదే కానీ ఒక్క దానిక్కూడా సాయం చేసేది కాదు. అందుకే దానికి అడవిలో స్నేహితులెవ్వరూ లేరు.

అదే అడవిలో రావి చెట్టు మీద వున్న గూటిలో ఒక ఉడుత నివసిస్తుండేది. అదెంతో పరోపకారి. దానికి బంధువులెవరూ లేరు. తన కడుపు నిండేంత వరకే పండ్లు తిని, మిగిలినవి తోటి జంతువులకు ఇచ్చేది. అడవిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తనకు కలిగినట్లే భావించి, వాటి బాధలు తొలగించడానికి శక్తి మేరకు ప్రయత్నించేది. ఖాళీ సమయాన్నంతా సాటి జంతువులకు సాయపడేందుకే వినియోగించేది. అందువల్ల ఉడుతకు బోలెడంతమంది స్నేహితులున్నారు.

ఓ రోజు ఉడుత చెట్టు మీద నుండి దిగుతూ పట్టు తప్పి, రాళ్ల మీద పడింది. చింత గింజంత మేర చర్మం లేచిపోయి రక్తం కారసాగింది. అది లేచి వెళ్లలేక అలాగే కూలబడింది. దాన్ని చెట్టు మీది కాకి చూచి, "మన నేస్తం ఉడుతకు దెబ్బతగిలిందహో...!" అని గట్టిగా అరిచింది.

ఆ పిలుపును పక్క చెట్టు మీద వున్న గద్ద వింది. రివ్వున ఎగురుకుంటూ వచ్చి ఉడుత ముందు వాలింది. కాకి వెంట రాగా ఉడుతను తన కాళ్లతో భద్రంగా పట్టుకుని, ఎలుగుబంటి డాక్టర్ దగ్గరకు మోసుకెళ్లింది.



"చిన్న దెబ్బే. కొద్దిరోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటే గాయం మానిపోద్ది..." అని డాక్టర్ వాటికి ధైర్యం చెప్పింది. ఈ వార్త అడవిలో గుప్పమంది. ఇంకేముంది. జంతువులూ, పక్షులూ తమ పనులన్నీ ఎక్కడివక్కడే వదిలేసి, ఉడుత కోసం బయలుదేరాయి.

"ఉడుత త్వరగా కోలుకోవడం కోసం నేను రక్తమిస్తాను" అంది జిరాఫీ. "నేను దగ్గరుండి సేవ చేస్తాను" అంది అడవిదున్న. "నేను నా రెక్కలు ఊపుతూ ఉడుతకు విశ్రాంతి కలగజేస్తా..." అంది పావురం. "ఎంత డబ్బు ఖర్చయినా ఫర్వాలేదు. మా దోస్త్ త్వరగా కోలుకోవాలి..." అంది డేగ డాక్టర్‌తో. దైవభక్తి కలిగిన జంతువులు, పక్షులు ఉడుత త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థించసాగాయి. ఇంకా జంతువులు ఉడుతను చూడ్డం కోసం వస్తూనే వున్నాయి. అప్పుడో సంఘటన జరిగింది.

ఏనుగు అడవిలోని వెలగపండ్లు బుట్ట నిండా కోసుకొని ఇంటికి వస్తూ పెద్ద గోతిలో పడిపోయింది. అది బయటకు రావాలని చాలా ప్రయత్నించింది. కానీ రాలేకపోయింది. బిగ్గరగా ఘీంకరిస్తూ సాయం అర్థించింది. ఉడుతను చూద్దామని వెళ్తున్న జంతువులకు ఏనుగు రోదన వినబడింది. గోతి దగ్గరకు వెళ్లాయి. ఏనుగును చూడగానే ముఖం తిప్పేసుకుని, "నువ్వా? తీస్తాంలే కాస్తాగు. మా ప్రాణ స్నేహితునికి దెబ్బ తగిలింది. ఎలా వున్నాడో చూసి, వచ్చేటప్పుడు తీస్తాం.." అని వెళ్లిపోయాయి.

గోతిలోపడ్డ విషయం తెలిసి ఏనుగు భర్త, పిల్లలు పరిగెత్తుకు వచ్చాయి. కానీ దాన్ని ఏ మాత్రం పైకి లాగలేకపోయాయి. మూడు రోజులు గోతిలో అలాగే వుండిపోయింది.

✿ ✿ ✿

ఉడుతకు పరిచర్యలు చేస్తున్న జంతువులు మాటల సందర్భంలో ఏనుగు విషయాన్ని ప్రస్తావించాయి. ఉడుత "విషయమేంటి?" అని అడిగింది.

"మేము నీ దగ్గరకు వచ్చేటప్పుడు ఏనుగు గోతిలో పడివుంది. వెళ్లేటప్పుడు దాన్ని తీద్దామనుకున్నాం. అయినా దానికి ఆ శాస్తి జరగాల్సిందే. అదెప్పుడూ పరుల మేలు కోరదు" అంది అడవిదున్న.

"మీరు చాలా తప్ప చేస్తున్నారు. మనకు సాయం చేసిన వారికి తిరిగి ఉపకారం చేయడంలో గొప్పతనమేముంది? ఎప్పుడూ సాయపడని వారికి మేలు చేయడంలోనే మన గొప్పతనం వుంది. నేనిప్పుడు బాగున్నాను. నాకేమీ కాదు. మీరందరూ వెంటనే వెళ్లి ఆ ఏనుగును బయటకు తీయండి. వెళ్లండి..." అని ఆజ్ఞాపించింది ఉడుత.

జంతువులన్నీ కదిలివెళ్లి తాళ్లతో ఏనుగును బయటకు లాగాయి. ఏనుగు చాలా సిగ్గుపడింది. "నేను తోటి జంతువులకు ఎప్పుడైనా సాయం చేసి వుంటే, ఈ మూడు రోజులు తిండీతిప్పలు లేకుండా ఇలా గోతిలో పడి వుండకపోదును. నా స్వార్థం వల్లే ఇలా గుంటలో మగ్గిపోవాల్సి వచ్చింది. ఇకముందు నేను కూడా ఉడుతలా జంతువులకు సాయంచేస్తా..." అంది. తర్వాత ఏనుగు ఇంటికి కూడా వెళ్లకుండా పండ్లు, కాయలు కోసుకుని ఉడుతను చూసేందుకు బయల్దేరింది. ❂



చిన్నారి చిత్రకారులు

ఆర్.సిద్ధార్థ,
7వ తరగతి,
[illegible]

ఎ.అనిల్, 5వ తరగతి,
సంస్కార భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్,
సోంపేట, శ్రీకాకుళం.

పచ్చినీల సాత్విక్,
7వతరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత
పాఠశాల, చిలకపాడు,
నెల్లూరు.

సుంకర ప్రసాద్,
10వతరగతి,
ఎస్.వి.ఎస్. పబ్లిక్ స్కూల్,
చినకాకాని.

అంతటి జ్యోతి,
9వ తరగతి,
వెలిమినేడు, నల్లగొండ.

టి.శ్యామలాదేవి,
5వతరగతి,
ఎమ్ఎన్ఆర్ హై స్కూల్,
భ్రమరాంబికానగర్, బీరంగూడ.

ఏమేం వున్నాయి?



హలో చిన్నారి నేస్తాలూ... 'మ్యాజిక్ మ్యాజిక్'లో మనం ప్రతివారం చెప్పుకుంటున్న విషయాలు ఎలా వుంటున్నాయి? మీకు నచ్చుతున్నాయా? మీరు వాటిని ఇష్టపడుతున్నారనే అనుకుంటున్నాం. మీరు మాత్రమే చదువుకుని ఊరుకోకూడదు. మీ స్నేహితులకు కూడా చూపించాలి. చదివించాలి. సరేనా. మరి ఈ వారం మీకోసం ఒక వెరైటీ బొమ్మ తీసుకొచ్చాం. అందులో ఏవేం వున్నాయో చూసి చెప్పాలి. చెప్పండి చెప్పండి. ఆలస్యం చెయ్యకూడదు. 'ఓకే. ఆ బొమ్మలో ఒక చెయ్యి బంతిని పట్టుకుని వుంది. అంతేకదా. దానికి ఇంత పెద్ద సీన్ సృష్టించాలా?' అంటున్నారు కొందరు నేస్తాలు. కానీ మీరు బాగా పరిశీలనగా చూసి చెప్పాలి. 'ఆ... చూస్తున్నాం. ఈ బంతి భలే తమాషాగా వుందండీ. బంతిలో ఒక మనిషి వున్నాడు. ఇంకా ఇల్లు... కిటికి.... ఏవేవో వస్తువులు కనిపిస్తున్నాయి. మొత్తంమీద భలే విచిత్రంగా వుంది' అంటున్నారు చాలామంది నేస్తాలు. ఇవాళ నచ్చారర్రా మీరంతా. మొత్తంమీద ఇవాళ మీరు బొమ్మలో వున్నవాటిని సరిగ్గా చెప్పగలిగారు చాలా సంతోషం. మరి వచ్చేవారం మరో మంచి బొమ్మ తీసుకొస్తాం.మీ స్నేహితులతో సహా రెడీగా వుండాలి మరి. వుంటారా?

చుక్కలు కలిపితే...!

నేస్తాలూ...!

చిన్నారి చిత్రకారులు పంపిన బొమ్మలను పెద్దవిగా పెడుతున్నాం. బావుంటున్నాయికదూ. అందుకని ఇక నుంచి కాస్త కుదురుగా కూర్చుని చక్కగా వేసి పంపండే.

మరి గతవారం 'కలం స్నేహం' చూశారుగా. ఎలా వుంది? వాటిని చూస్తే మీక్కూడా కలం స్నేహం చేయాలనిపించి వుంటుంది. కదూ. అలా అయితే వెంటనే ఒక కార్డు తీసుకుని మీ పేరు, క్లాసు, హాబీలు, అడ్రస్ రాసి, మీ కలర్ ఫొటో అతికించి పంపండి. మేం ప్రచురిస్తాం.

మా చిరునామా: బాల నేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

గతవారపు చిక్కుప్రశ్న సమాధానం

అతడు వెంటనే గుర్రాన్ని ఆపి, పెట్రోలుతో తడిసిన ఆకులను వెనక్కి పోగుచెయ్యాలి. అలా వేరుచేయడం వల్ల మంటల బారి నుండి సులభంగా బయటపడవచ్చు.

ఎటుకూడినా పాతికే

సరదా లెక్క



హాయ్! ఈ వారం మీకోసం ఒక సరదా లెక్క తీసుకొచ్చాం. పక్కన గడులున్నాయికదా. ఎటునుంచి కూడినా 25 రావాలన్నమాట. జవాబు కావాలంటే వచ్చే వారం చూడండి.

నీళ్ల పందెం

చిక్కుప్రశ్న

మీకొక పందెం. బిందెడు నీళ్లు పెడతాం. అందులో గ్లాసుడు నీళ్లు లేకుండా తాగెయ్యాలి. ఏంటి అలా చూస్తున్నారు? ఈ పని ఎవరైనా చెయ్యగలరు. తీరా జవాబంతా చెప్పాక ఆ మాట అనకూడదు. అది సరేకానీ ముందు మనం అనుకున్నది చెయ్యగలరా? లేదా? ఆలోచించుకోండి మరి. వచ్చేవారం జవాబు చెప్తాం. అందాకా బిందె ఎదురుగా కూర్చుని ఆలోచించుకోండి.

కాటకపాటకులు

పంచతంత్ర కథలు



"కరటకా! పూర్వం పింగళకునికి సేవ చేసేందుకు కాటక, పాటకులనే రెండు నక్కలు వుండేవి. ఒకసారి పింగళకుడికి కోపం వచ్చి వాటిని వెళ్లగొట్టాడు. ఆ నక్కలు ఇప్పుడు సంజీవకుడనే వృషభంతో చెలిమి చేస్తున్నాయి. దీన్ని అదునుగా తీసుకుని సంజీవకుడి మీద పింగళకుడికి అనుమానం కలిగేలా చేస్తాను" అన్నాడు దమనకుడు.

"మంచిది. జాగ్రత్తగా పని నెరవేర్చుకురా!" అన్నాడు కరటకుడు. వెంటనే దమనకుడు పింగళకుడి దగ్గరకు వెళ్లాడు. నమస్కరించి దీనంగా తలవంచుకున్నాడు. "దమనకా! అలా వున్నావేంటి? నీకు ఎవరైనా కీడు తలపెడితే వాడు లోకంలో జీవించగలడా? నువ్వు ఇలా వుండటానికి వేరే కారణం ఏమైనా వుందా?" అని అడిగాడు పింగళకుడు.

"మహారాజా! మీ మిత్రుడైన సంజీవకుడు పూర్వంలా లేదు. అతనికి రాజ్య దాహం పుట్టింది. మిమ్మల్ని చంపి ఈ అడవికి రాజు కావాలని కాటక, పాటకులతో కుట్ర పన్నుతున్నాడు. ఇది తెలిసి నేను దిగులుపడుతున్నాను" అన్నాడు దమనకుడు.

"సంజీవకుడికి నేను ఎంతో గౌరవం ఇచ్చాను. మంత్రిని చేశాను. అలాంటి నా ప్రాణ మిత్రుడు నాకు నమ్మక ద్రోహం చేస్తాడా? నేను నమ్మను" అన్నాడు పింగళకుడు.

"అవును మృగరాజా! మంత్రి పదవిలో వున్న వారు చెప్పిందే ప్రభువులు నమ్ముతారు. అయినా నేను నిజం చెప్పక తప్పదు. పామును కాలితో తన్నినా, తల మీద పెట్టుకుని పూజించినా కాటు వేయక మానదు. అలాగే సంజీవకుడు కూడా తన పాడుబుద్ధిని వదులుకోలేదు. మంత్రి పదవి ఇచ్చిన మిమ్మల్నే పదవీ భ్రష్టుల్ని చేయాలని చూస్తున్నాడు. కాటక, పాటకులతో సంజీవకుడు తిరుగుతున్న మాట నిజమో కాదో మీ మిత్రులను అడిగి తెలుసుకోండి" అన్నాడు దమనకుడు.

ఆ మాటలు వినగానే పింగళకుడు తన మిత్రుడు నక్కలరాయుని పిలిచాడు. "కాటక, పాటకులతో సంజీవకుని స్నేహం నిజమేనా?" అని అడిగాడు. "అయ్యా! నా నోటితో ఏం చెప్పమంటారు?" అన్నాడు నక్కలరాయుడు తలవంచుకుని. మిత్రుడు అలా అనడంతో దమనకుడు చెప్పింది నిజమే అనుకున్నాడు పింగళకుడు.

"అయితే వెంటనే సంజీవకుడిని వెళ్లగొడతాను" అన్నాడు పింగళకుడు గర్జిస్తూ.

"అలా చేస్తే సంజీవకుడికి మీ మీద ద్వేషం పెరుగుతుంది. వెంటనే అపకారం చేయాలని చూస్తాడు" అన్నాడు దమనకుడు.

"వాడు నాకు అపకారం చేస్తాడా?" అంటూ పింగళకుడు వెటకారంగా నవ్వాడు.

"ఏమో, అతని స్వభావం ఎలాంటిదో కదా! స్వభావం తెలియకనే అతనికి మీ స్థానంలో చోటు ఇచ్చి కష్టం తెచ్చి పెట్టుకున్నారు. పూర్వం ఒక నల్లికి స్వభావం తెలియక చోటు ఇచ్చిన ఒక పేను తన ప్రాణాన్నే పోగొట్టుకున్నది. ఆ కథ చెబుతాను వినండి" అని దమనకుడు కథ ప్రారంభించాడు.

బహుమతి ఫోటో

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ



కనుచూపు మేరలో ఎగురుతున్న పక్షుల గుంపు నీలాకాశంలో ముత్యాల దండ కదులుతున్నట్లుగా అన్పిస్తోంది.

కృష్ణానది నీటి తరగల మీదుగా వస్తున్న గాలి కెరటాలు మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.

సాయం సంధ్య రంగుల చీర చుట్టుకుంది.

తమ్మా శ్రీనివాసరెడ్డి హృదయం ఆనందంతో ఉక్కిరిబిక్కిరిగా వుంది. తెలియని ఆనందం లోలోపల తుపాన్‌లు రేపుతోంది.

విజయవాడలో సాయంత్రం ప్రశాంతంగా ఉంది. మేడమీద కూర్చున్న శ్రీనివాసరెడ్డి అప్పుడే అందుకున్న ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదువుకున్నాడో తెలియలేదు. సముద్రమంతటి సంతోషాన్ని ఎవరితో పంచుకోవాలో తెలియలేదు.

తాను అపురూపంగా చూసుకుంటున్న కెమెరాను ముద్దుపెట్టుకున్నాడు. గదిలో కుప్పలుగా ఉన్న ఫొటోలను మరోసారి చూసుకున్నాడు.

ఫొటోగ్రాఫర్‌గా ఎన్నో పురస్కారాలను అందుకున్నప్పుడు కాని, అందమైన అరుదైన అద్భుతమైన ఫొటోలు తన కెమెరా కంటికి చిక్కినప్పుడు కాని ఇంతటి ఆనందం కలగలేదు.

ఇండోర్‌లో జరిగిన ఫొటోగ్రఫీ పోటీలో శ్రీనివాసరెడ్డి తీసిన ఫొటోకు ప్రథమ బహుమతి లభించిందని వచ్చిన సమాచారం ఎంతో సంతోషాన్ని కలిగించింది. ఆ ఫొటోకు బహుమతి వస్తుందని కూడా అనుకోలేదు. ఏకంగా మొదటి బహుమతి రావడమే ఆశ్చర్యం కలిగించింది.

విజయవాడ సమీపంలో ఉండవల్లి గ్రామానికి చెందిన తమ్మా శ్రీనివాసరెడ్డి రైతు కుటుంబానికి చెందిన వాడు. చిన్నతనంలో అంటే పదవ తరగతిలో ఒక డాన్సర్‌కి తీసిన ఫొటోను ఎంతోమంది మెచ్చుకోవడంతో ఫొటోగ్రఫీ పట్ల ఆసక్తిని పెంచుకున్నాడు. సోషల్‌వర్క్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి నాగపూర్ యూనివర్సిటీలో ఎం.ఫిల్ చేసి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఉద్యోగ అవకాశం వచ్చినప్పటికీ చేరకుండా ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్‌గా విజయవాడలో స్థిరపడ్డాడు.

ఫొటోలు తీయడమే ప్రాణంగా భావించే శ్రీనివాసరెడ్డి ఫొటోకు బహుమతి రావడం అతడిని ఉక్కిరి బిక్కిరి చేసింది.

ఫైలు వెతికి బహుమతి వచ్చిన ఫొటో కాపీని బైటికి తీశాడు. అందమైన చిన్న అమ్మాయి... రంగుల బెలూన్లు అమ్ముతున్న ఆ ఫొటోలో ఏ ప్రత్యేకతా లేకపోయినా అద్భుతంగా అనిపిస్తోంది.

ఫొటోను చూస్తుంటే గతం గుర్తుకు వచ్చింది.

మెడకు కెమెరా తగిలించుకుని సత్యన్నారాయణ పురం వైపువెళుతుండగా బెలూన్లు అమ్ముకునే నాలుగేళ్ళ అమ్మాయి కనిపించింది. వెంటనే కెమెరా క్లిక్‌మనిపించాడు. అందంగా వచ్చిన ఆ ఫొటోనే ఎన్‌లార్జ్ చేసి ఇండోర్‌లో జరిగే ఫొటోఎగ్జిబిషన్ పోటీకి పంపించాడు.

ఆ ఫొటో బహుమతిని సొంతం చేసుకుంది.

బహుమతి పొంది శ్రీనివాసరెడ్డికి ఆనందాన్ని కలిగించిన ఆ ఫొటో ఎక్కడో వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక కుటుంబానికి మరింత ఆనందాన్ని అందించింది.

* * *

భిలాయ్...

1997 జులై 7

పదకొండు గంటలైంది.

రోడ్డు పక్కనున్న చిన్న హోటల్‌లో హడావుడి మొదలైంది. వచ్చిపోయే వాహనాల సిబ్బంది కోసం ప్రారంభించిన ఆ హోటల్ కొద్దిగా పుంజుకుంటోంది.

దానిని ప్రారంభించిన బలరామ్‌దాసు లోపలికి వెళ్ళి 'భోజనం తయార్' అని హిందీలో రాసి వున్న స్టాండుబోర్డును హోటల్ ముందు పెట్టాడు.

లోపల అతని భార్య రాగమణి వంట ఏర్పాట్లు చేస్తోంది.

హోటల్‌లో భోజనాలు ప్రారంభించడానికి ముందు ఒక్కగానొక్క కూతురు ఫొటో ముందు నిల్చుని మనసులో ఆమెను జ్ఞాపకం చేసుకోవడం ఆ దంపతులకు అలవాటు. రెండేళ్ళ నుంచి ఆమె ఎడబాటు ప్రతిక్షణం వారి మనసులో మెదులుతూనే ఉంది. అందుకే ఆ అమ్మాయి పేరుతోనే గుడియా భోజన హోటల్‌ను ప్రారంభించారు.

రెండేళ్ళ క్రితం ఆ దంపతులు తిరుపతిలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి కుటుంబ సమేతంగా వెళ్ళారు. వచ్చే సమయంలో విజయవాడలో ట్రైను ఆగినప్పుడు గుడియా మంచినీళ్ళ కోసం కిందకు దిగింది. ఆమె చూసుకోకముందే రైలు కదిలిపోయింది. తర్వాత బలరామదాసు, రాగమణి గమనించారు. పక్క బోగీలో ఉన్న తమ బంధువుల వద్ద ఉందని అనుకున్నారు. తప్పిపోయిందని ఆలస్యంగా తెలుసుకున్నారు. తర్వాత ఆమె ఆచూకీ కోసం ఎంతగానో ప్రయత్నించారు. అయినా ఫలితం కనిపించలేదు.

ముద్దుల కూతురు గుడియా కూడా కనిపించలేదు.

ఆ షాక్ నుంచి ఇప్పటివరకూ వారు కోలుకోలేదు.

హోటల్ ముందు గదిలోకి వచ్చి బలరామ్‌దాస్ రోడ్డు పక్క ఆగే లారీల కోసం ఎదురు చూశాడు. ఆ తర్వాత క్రమక్రమంగా హోటల్‌లో హడావుడి పెరిగింది.

దాసు పనిలో నిమగ్నమైపోయాడు.

ఇంతలో రోడ్డుపక్క లారీ ఆగింది. లారీ సిబ్బందితో సహా నలుగురు ప్రయాణీకులు కూడా కిందకు దిగారు.

భోజనాలకు వారిని దాసు సాదరంగా ఆహ్వానించాడు.

భోజనానికి కూర్చున్న ఓ వ్యక్తి చేతిలో 'దైనిక భాస్కర్' దినపత్రిక వుంది. ఉత్తరాదిలో అత్యధిక సర్క్యులేషన్ ఉన్న హిందీ పత్రిక అది. అందులో రకరకాల వార్తలు, విశేషాలు ప్రముఖంగా ప్రచురిస్తుంటారు.

బలరామ్‌దాసు యథాలాపంగా ఆ పత్రిక చూశాడు.

అందులో మొదటి పేజీలో రంగురంగుల బెలూన్లు పట్టుకున్న నాలుగేళ్ళ అమ్మాయి ఫొటోను ప్రచురించారు. ఇండోర్‌లో జరిగిన ఫొటోగ్రాఫ్‌ల పోటీలో మొదటి బహుమతి పొందిన తమ్మా శ్రీనివాసరెడ్డి తీసిన ఫొటో అది.

ఫొటోను చూసి దాసు షాక్ అయిపోయాడు.

భార్యను పిలిచి చూపించాడు.

రెండేళ్ళ క్రితం తప్పిపోయిన తమ ముద్దుల కూతురు గుడియా ఫొటో అది. అన్ని యాంగిల్స్‌లో చూసి ఆమె తమ కూతురు అని నిర్ధారించుకున్నారు.

"మన అమ్మాయి గుడియా... నా ముద్దుల పాప చనిపోలేదండీ! అది బతికే ఉంది..." రాగమణిలో ఉద్రేకం... ఆమె నోటి నుంచి మాటలు తడబడుతున్నాయి. కంటి నుంచి నీటి ప్రవాహానికి తడబాటు లేదు.

ఫొటోగ్రాఫర్ పేరు, చిరునామా చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడగా ఉంది. అంటే 'తమ చిన్నారి విజయవాడలోనే ఉందన్నమాట' అనుకున్నారు. శ్రీనివాసరెడ్డిని ఎంత తొందరగా కలుసుకుంటామా? తమ కుమార్తె ఆచూకీ తెలుసుకుంటామా అని దంపతులిద్దరూ ఉద్వేగ భరితులయ్యారు.

భిలాయ్ నుంచి ఆ రోజే విజయవాడ బయలుదేరారు.

* * *

బలరామ్‌దాస్... రాగమణి దంపతుల్ని చూసి తమ్మా శ్రీనివాసరెడ్డి ఆశ్చర్యపోయాడు. ఎక్కడో భిలాయ్‌లో ఉన్న జంట తన ఫొటో కోసం విజయవాడ రావడం అతడిని విస్మయానికి గురి చేసింది.

ఆటోలో దంపతుల్ని సత్యనారాయణపురం తీసుకువెళ్ళి తాను ఫొటో తీసిన ప్రాంతాలన్నీ వెతికాడు.

వీధుల్లో ఆటసామాగ్రి ఇల్లిల్లూ తిరిగి అమ్మే సంచార జాతి కుటుంబీకుల మధ్య గుడియా కనిపించింది.

తల్లిదండ్రులు ఆమెను గుర్తించారు.

గుడియా కూడా అమ్మా నాన్నలను గుర్తు పట్టింది.

రెండేళ్ళు దూరమై బతికి ఉందో, చనిపోయిందో తెలియని తమ కుమార్తె సజీవంగా తమ ముందు సాక్షాత్కరించడం వారి హృదయాలను ఉక్కిరిబిక్కిరి చేసింది.

కూతుర్ని దగ్గరకు తీసుకొని ముద్దుల వర్షం కురిపించారు. ప్రేమతో అక్కున చేర్చుకున్నారు. బురదలో వజ్రంగా వున్న ఆమెకు స్నానం చేయించి కొత్తబట్టలు తొడిగారు.

శ్రీనివాసరెడ్డికి అంతా కలలా అనిపించింది.

* * *

"బాబూ! నీ మేలు ఈ జన్మలో మరచిపోలేము. కొన్ని వందల మైళ్ళ దూరంలో కడుపుకోతతో నిరంతరం దుఃఖిస్తున్న మాకు స్వాంతన కలిగించావు. జీవితంలో మరి చూస్తామో లేదో అనుకున్న మా ఇంటి ఇలవేల్పును మా వద్దకు చేర్చావు. నువ్వు తీసిన ఫొటో దూరమైన మనుషుల్ని, మనసుల్ని కలిపింది..." రాగమణి ఒక్కొక్క మాట నెమ్మదిగా చెప్పింది.

అలా చెబుతున్నప్పుడు ఆ మాటల్లో మాతృహృదయపు వేదన తొంగిచూసింది.

"నీకు ఏమి ఇచ్చి కృతజ్ఞత చెప్పుకోగలం..." బలరామ్‌దాసు అడిగాడు.

శ్రీనివాసరెడ్డి రెండు నిమిషాలు మాట్లాడలేకపోయాడు.

జరిగిన సంఘటన సినిమా దృశ్యంలా అనిపించింది.

తను తీసిన ఫొటో ఒక అనాథగా మారిన అమ్మాయికి తల్లిదండ్రుల్ని సంపాదించిపెట్టడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. తర్వాత నెమ్మదిగా అన్నాడు. "నేను మామూలుగా తీసిన ఫొటో ఇంతటి ప్రభావాన్ని చూపిస్తుందని అనుకోలేదు. నేను ఎన్నో ఫొటోలు తీశాను. నాకు ఎన్నో అవార్డులు వచ్చాయి. మీ అమ్మాయికి తీసిన ఫొటోకు కూడా నాకు ప్రథమ బహుమతి లభించింది. ఆ విషయం తెలిసిన వెంటనే ఎంతో ఆనందం కలిగింది. అయితే ఆ ఫొటో వల్ల తప్పిపోయిన మీ అమ్మాయిని మీరు కలుసుకున్నారంటే మరీ ఆనందం కలిగించింది. ఈ సంఘటన నాకు లభించిన అవార్డు కన్నా గొప్ప రివార్డు. ఇంతకన్నా నాకు మరేమీ అవసరం లేదు. నా వృత్తిలో ఇంతకుమించిన తృప్తి ఎప్పుడూ కలగలేదు....." శ్రీనివాసరెడ్డి చెప్పాడు.

"తల్లిదండ్రులను చేరిన బాలిక" పేరుతో వారి ముగ్గురిని ఫొటో తీసి ప్రింటు చేయించి వారి చేతిలో పెట్టాడు.

ఆ ఫొటోను చూసి వారు మరింత సంతోషించారు.

వారిని రైలు ఎక్కించాడు.

ఆ తర్వాత ఇంటికి వచ్చి మేడపైన కుర్చీ వేసుకుని కూర్చున్నాడు. జరిగిన సంఘటన మనసులో పదేపదే మననం చేసుకుంటుంటే అదోలాంటి సంతృప్తి హృదయాంతరాళాల్లో వ్యాపించింది.

ఆ చల్లని సాయంత్రం మరింత హాయిని కలిగించింది.

తెలియని ఆనందం మనసులో తుఫానులు రేపుతోంది.

సాయంసంధ్య రంగుల చీర చుట్టుకొంది.

కృష్ణానది నీటి తరగలపై వస్తున్న గాలి కెరటాలు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.

కనుచూపుమేరలో ఎగురుతున్న పక్షుల గుంపు నీలాకాశంలో ముత్యాల దండ కదులుతున్నట్లు అన్పిస్తోంది.

★

ఈ కర్రీ పేరేమిటి?

లక్ష్మి

అ తనొక కారు డ్రైవరు!

కారు నడపడం అతని వృత్తి!

అతని టాక్సీలో మనం ప్రయాణం చేస్తున్నాం. చాలా దూరం వెళ్ళాలి. ఆ డ్రైవరు మనల్ని క్షేమంగా తీసుకెడతాడో - అడుగడుక్కీ మనల్ని టెన్షన్లో పెట్టి మన గుండె దడ పెంచుతాడో తెలీదు!

అంచేత -

ఎందుకైనా మంచిదని...

ముందు జాగ్రత్తకోసం మనం అనేకానేకమైన హెచ్చరికలు చేస్తుంటాం!

అతను జోరుగా వెడుతున్నప్పుడు - స్పీడు తగ్గించటమంటాం. మన మాట ప్రకారమే అతను వేగం తగ్గించి మెల్లిగా వెడుతున్నప్పుడు - ఇది టాక్సీనా ఎద్దుబండీనా అని చిరాకు పడతాం!

మన చిరాకు గమనించి -

అతను మళ్ళా వేగం పెంచినప్పుడు...

స్పీడొద్దని నీక్కాదూ చెప్తూంట అని కోప్పడతాం!

ఏతావాతా కార్లో కూచున్న వాళ్ళతో - కారు నడిపే మనిషికి అన్నీ పేచీలే ఎదురవుతాయి!

అడుగడుక్కీ మందలింపులు తప్పవుగాక తప్పవు!

అంతేతప్ప-

చక్రం తిప్పడంతో తన అనుభవం పాసింజర్లు పట్టించుకోరు!

ఆ రోడ్డుతో తనకున్న అనుబంధం వాళ్లకి తెలీదు!

సదరు రూట్లో ఎక్కడెక్కడ ఎన్నెన్ని మలుపులుంటాయో... ఏ మలుపు ఎంత ఇబ్బంది పెడుతుందో....

ఎక్కడెక్కడ ఎత్తు పల్లాలుంటాయో... ఏ ఎత్తు ఏ పల్లం ఎల్లాంటి సమస్య తెచ్చిపెడుతుందో వగైరా వివరాలన్నీ ఆ డ్రైవరు కళ్ళు మూసుకుని చెప్పగలడు!

అల్లాంటి డ్రైవరుకి -

అడుగడుక్కీ హెచ్చరికలు చేసి విసిగించడం తగునా? నేనిప్పుడు కారు డ్రైవింగు గురించి చెప్పడం లేదు!

ఒక సంసారం ఒడిదుడుకులు లేకుండా సాఫీగా నడపడం - ఇంచుమించు కారు డ్రైవింగు లాటిదనే ఉద్దేశంతో.. ముందస్తుగా కారు డ్రైవింగు గురించి మనవి చేసేను. అంతే!

సంసారం సాగరమన్నారు ఆర్యులు!

ఈ సాగరం రోడ్డు కంటే భయంకరమైనది. లోతు తెలీదు. ఆ లోతులో వున్న చమత్కారం తెలీదు. అక్కడ ఎన్ని తిమింగలాలు తిరుగుతుంటాయో తెలీదు. ఏ తిమింగలం ఎంత దుర్మార్గంగా వుంటుందో అస్సలు తెలీదు!

తీరం తెలీదు. ఏ దిక్కున వెడితే ఆ తీరం తగుల్తుందో తెలీదు. ఎంతదూరం వెళ్ళాలో తెలీదు!

తుపాన్ రావడం సహజమని తెలుసు!

ఎప్పుడొస్తుందో తెలీదు. ఎందుకొస్తుందో తెలీదు. ఆ భయంకరమైన తుపాన్లో నౌక ఎటు కొట్టుకుపోతుందో తెలీదు. ఎక్కడ మునిగిపోతుందో తెలీదు. ఎన్ని ముక్కలవుతుందో తెలీదు!

ఇన్ని తెలీదుల మధ్య -

సంసార నౌకను సురక్షితంగా గమ్యం చేర్చాలి!

అందుకు ఓర్పుతో పాటు నేర్పు కూడా కావాలి!

ఈ పనికి మహిళ మాత్రమే తగును అన్నారు ఆర్యులు!

సంసార నౌకను చాకచక్యంతో నడిపే ఆర్టు ఆడవాళ్ళకి మాత్రమే తెలుసని అనాదిగా వినిపిస్తున్న సుభాషితం!

ఆడవాళ్ళకి జన్మతః అలవడిన అందమైన ఆర్టది!

ఆమె - ప్రత్యేకించి ఆర్థిక శాస్త్రం చదవకపోవచ్చు. ఆ మాటకొస్తే ఆమె చదువుల తల్లి కాకపోవచ్చు!

ఎంత చెట్టుకి అంతగాలి అనే సూత్రాన్ని నమ్ముతుంది!

చెట్టుకి తగ్గ గాలిని అంచనా వేస్తుంది. ఆ అంచనాతోనే అందిన ఆదాయాన్ని అవసరాలకు ఖర్చు చేస్తుంది!

అంతో ఇంతో రేపటి కోసం భద్రం చేస్తుంది!

ఇంత శ్రమ పడుతున్న ఇంతి దక్షతను - ఆ ఇంటాయన మెచ్చుకోడు. పై పెచ్చు - కార్లో కూచున్న పాసింజరు మాదిరి - టెన్షన్లు పెంచుకుని పోషిస్తుంటాడు!

అంచేత -

చచ్చు హెచ్చరికలు అనేకం చేస్తుంటాడు!

స్పీడు తగ్గించమంటాడు. వేగం పెంచమంటాడు. అదిగదుగో మలుపు అంటాడు. ఆ మలుపు దగ్గిర కొస్తుంటే - ఆర్తనాదం చేస్తుంటాడు. అప్పుడప్పుడు - నీక్కాదూ చెప్తూంట అని కోప్పడతాడు!

అంతేతప్ప-

చక్రం తిప్పడంలో ఆమె గొప్ప ప్రవీణురాలనే నిజాన్ని అతను అంగీకరించేందుకు ఎప్పటికప్పుడు తటపటాయిస్తుంటాడు!

అప్పుడప్పుడు -

అతను వంట చేస్తానని మారాం చేస్తాడు!

మీకు చేత కాదంటుందామె!

నీకెట్లా చేతైంది అని చెత్త ప్రశ్న అడుగుతాడు!

ఆ రంగంలో - అమ్మా అమ్మమ్మల తర్ఫీదు గురించి చెబుతుంది. బామ్మ దగ్గిర నేర్చుకున్న పాకశాస్త్రం వంకలేనిదని వర్ణించి చెబుతుంది!

అతను -

నా దగ్గిర వంటల పుస్తకం వుందంటాడు!

ఆ పుస్తకంతో కుస్తీ పట్టి -

పప్పూ దోసకాయ వండుతాడు. ఆ ముద్ద నోట్లో పెట్టుకుని - పప్పులో వేసింది టమోటానా ఆనపకాయా అని అడుగుతాడు!

చిత్తగించగలరు. ★

అన్నిటికీ సమాధానాలుంటాయా?

ఎండల వేడి తట్టుకోలేకుండా వుంది. మల్లెపూలు, మామిడిపండ్లు ఎండజోరును మరిపిస్తాయంటారు. అటువంటిది ఈ ఏడు మామిడిపండ్లు బాగా కాయలేదు. కాసినా వర్షాలకు, వడగండ్లకు, గాలులకు తట్టుకొని నిలబడలేకపోయాయి. ఇక ఈ సంవత్సరం ఎండాకాలంలో మామిడిపండ్లు అపురూపమే అయిపోతాయేమో! చింతలు కాస్తే మామిడి చెట్లు కాయవు. మామిడిచెట్లు కాస్తే చింతలుకాయవు అని పెద్దలు గుర్తించిన విషయం. కాని ఈ ఏడు చింతలు, మామిడి చెట్లు రెండూ కాయకపోవడం వింతగానే వుంది!

డా॥ ముదిగంటి సుజాతారెడ్డి

"ఇదంతా కలికాలం మహిమ!" అంటుంది మా నాయనమ్మ. ఎదురుగా కనపడే ప్రతి మార్పునకు, విపరీతానికి కలిని దోషిగా నిలబెట్టడం మా నాయనమ్మకు అలవాటే!

"వాతావరణంలో మార్పు అనేది ఎప్పుడూ వుండేదే. దానికి కలి ఏం చేస్తాడు నాయనమ్మా! వర్షం రాక గురించి చెప్పటం ఎవరితరం కాదు. సకాల వర్షాలతో మంచి జరుగుతుంది కాని అకాల వర్షాలతో నష్టం జరుగుతుంది. ముఖ్యంగా పంటలకు, పండ్ల తోటలకు నష్టం జరుగుతుంది. దానికి కలి ఏం చేస్తాడు!" అన్నాన్నేను.

"నీకేం తెలియదే! మన చేతిలో ఏమీ వుండదు. అంతా భగవంతుడే చేస్తాడు. మనమంతా నిమిత్త మాత్రులం! ఇప్పుడు చింతలు కాయకపోతే మామిడిచెట్లు కాయాలా? - వద్దా చెప్పు. అది నియమంగా జరుగుతూ వస్తున్న విషయం. కానిఈసారి చింత, మామిడి రెండూ కాయ లేదు! అంటే దానికి కారణం ఏం చెప్తావు సుశ్శీ!" అంది మా నాయనమ్మ నా వైపు సవాలుగా చూస్తూ.

కాసేపు దానికేం సమాధానం చెప్పాలో నాకు తెలియలేదు. భుజాలెగురవేశాను.

"అదే! నీకు తెలియని అర్థం కాని విషయం ఒకటి వుందని తెలిసింది కదా నీకు!" అంది మా నాయనమ్మ విజయదర్పంగా.

"ఓకే! సరే! చింతలు, మామిళ్ళు రెండూ కాయలేదు అంటే వాతావరణంలో ఏదో జరిగింది అనుకోవాలి" అన్నాను చివరకు సమాధానం కనుక్కున్నట్లుగా.

"అదే నేనంటున్నది. వాతావరణంలో జరిగింది ఏమిటి! అట్లా ఎందుకు జరిగింది? వీటన్నిటికి ఏం కారణం చెప్తావు?" కండ్లు మెరిపిస్తూ నా వైపు చూసింది.

"అబ్బ! ఆ కారణం ఏమిటో వాతావరణ ప్రవీణులను, వ్యవసాయ శాస్త్రజ్ఞులను అడిగితే తెలుస్తుంది" అన్నాన్నేను.

"సుశ్శీ! అన్నిటికీ సమాధానాలుంటాయని అనుకోకు. వాళ్ళు మాత్రమేం చెప్తారు. అట్లా ఒక్కొక్కసారి జరుగుతుంది అంటారు. అంతేగాని అట్లా ఒక్కొక్కసారి ఎందుకు జరుగుతుందో వాళ్ళకు మాత్రమేం తెలుసు చెప్పు!" అంది బల్లమీద గుద్దినట్లుగా.

"అబ్బ! నాయనమ్మా! మనం వాళ్ళ దగ్గరికి పోలేదుకదా. పోయి అడిగితే ఏదో జవాబు చెప్తారు. ఎందుకు చెప్పరు" అన్నాన్నేను.

"సృష్టిలో అన్నిటికీ సమాధానాలు శాస్త్రజ్ఞులకు తెలుసని అనుకోకు అమ్మాయి. ఇంకా ఎన్నో రహస్యాలు తెలియనివి వున్నాయి."

"అది శాస్త్రజ్ఞులూ చెప్తున్నారు. ఇంకా విప్పవలసిన రహస్యాలెన్నో వున్నాయంటున్నారు" అన్నాన్నేను.

"హా! అది ఒప్పుకున్నావా! అదే నేనూ అనేది. అన్నిటికీ సమాధానాలు చెప్పే సామర్థ్యం మన దగ్గర లేదు. ఇప్పుడు చింతలూ మామిళ్ళు రెండూ కాయలేదెందుకు అని అడిగితే శాస్త్రజ్ఞులు మాత్రమేం చెప్తారు! వాళ్ళ బొంద!" అంది నాయనమ్మ చిరునవ్వులు చిందిస్తూ.

"నువ్వన్నది నిజమే నాయనమ్మా! అన్నిటికీ సమాధానాలు చెప్పటం మనకు ఎక్కడ చాతనవుతుంది!" అంది ఇంతసేపు మౌనంగా కూర్చున్న మా చెల్లెలు సుబ్బి. దాని పేరు సుభాషిణి. కాని మేమంతా సుబ్బి అని పిలుస్తాం.

"సుబ్బీ! సమాధానాలు అన్నిటికీ చెప్పలేము నిజమే కాని. అట్లా అని మరీ ఇర్రేషనల్‌గా అంటే హేతురహితంగా ఆలోచించటం సరైన పద్ధతి కాదు కద!" అన్నాన్నేను.

"సరైన పద్ధతి కాదు నిజమే కాని మీకు సమాధానం దొరకనప్పుడు మెదడూ, మనస్సు పాడు చేసుకునే దాని కన్నా ఓహో! మనకు తెలియనివెన్నో వున్నాయి. మన చేతుల్లో లేకుండా ఎన్నో జరుగుతాయని అనుకోవటం హేతుబద్ధమే అనుకుంటాను" అంది సుబ్బి.

"సుబ్బీ! ఇంత గొప్పగా ఆలోచించటం ఎప్పుడు నేర్చుకున్నావే!" అని ఆశ్చర్యపోయాన్నేను.

"అవునే సుశ్శీ! సుబ్బి నిజం తెలుసుకుంది. అన్నిటికీ సమాధానాలున్నాయి. తెలుసు అని తలబద్దలు కొట్టుకునేదాని కన్నా కొన్ని విషయాలనైనా మన వశంలో లేనివని ఒప్పుకుంటే మనశ్శాంతి అయినా దొరుకుతుంది! దేవుడు, దయ్యం అనక్కర్లేదు. కాని సృష్టిలోని కొన్ని విషయాలనన్నిటినీ మన అదుపాజ్ఞల్లో వుంచుకోలేం అని అంగీకరిస్తే కొంతవరకైనా సమాధానం దొరుకుతుంది. ఉపశమనం లభిస్తుంది!" అంది నాయనమ్మ శ్రీకృష్ణుని ఫోజులో. ★



ప్రజారోగ్యాన్ని బలిగొంటున్న దుర్వ్యసనాలు

ప్రపంచ ఆరోగ్యసంస్థ ఆధ్వర్యంలో తీర్మానించిన ‘అందరికీ ఆరోగ్యం’ అన్న నినాదం ఏనాటికీ సాధ్యంకాదని నేటి సమాజంలోని దుర్వ్యసనాలు సవాల్ చేస్తున్నాయంటే ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. కేవలం అంటువ్యాధుల్ని నిర్మూలించడం వల్లే అందరికీ ఆరోగ్యం అన్న లక్ష్యం నెరవేరుతుందనుకుంటే పొరపాటే అవుతుంది. అంటువ్యాధులు కాని క్యాన్సర్, లివర్, సిర్రోసిస్, పెప్టిక్ అల్సర్, రక్తపోటు, గుండెపోటు, పెరాలసిస్ (పక్షవాతం) వంటి వ్యాధులు యేటా లక్షలాది మందిని బలి తీసుకుంటున్నాయి. అంటువ్యాధుల నుంచే కాక మనిషిని ఈ వ్యాధుల నుంచి కూడా దూరం చేసినప్పుడే అందరికీ ఆరోగ్యం అన్న లక్ష్యం నెరవేరి ప్రజారోగ్యం బాగుపడుతుంది. ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాలు, ఇంకా వ్యభిచారం వంటి దుర్వ్యసనాలు నేడు ధనిక, పేదదేశాలన్న తారతమ్యం లేకుండా మొత్తం భూగోళం మీద బీభత్సం సృష్టిస్తున్నాయి. మనుషుల్ని మానసిక వ్యధకు గురిచేస్తున్నాయి. ఆరోగ్యపరంగానే కాక సమాజపరంగా కూడా సమస్యల్ని తెచ్చిపెడుతున్నాయి.

సాధారణంగా వరాన్నజీవులు, బ్యాక్టీరియా, వైరస్‌లు, శిలీంద్రాలు మొదలయిన సూక్ష్మక్రిముల వల్ల వచ్చే వ్యాధుల్ని మనకున్న అత్యాధునిక వైద్య శాస్త్ర పరిజ్ఞానంతో నయం చేయగలంగాని దుర్వ్యసనాల వల్ల శరీర అవయవాల నిర్మాణంలో శాశ్వత మార్పులు జరగడం ద్వారా వచ్చే వ్యాధుల్ని నయం చేయడం నేటి వైద్య శాస్త్రాభివృద్ధికి సైతం సాధ్యం కావడం లేదు. ఉదాహరణకు మద్యపానం వల్ల లివర్ (కాలేయం)కు వచ్చే రక్తనాళాలు మందమెక్కి ఎథిరోస్క్లిరోసిస్‌కు గురికావడం వంటివి ఇలాంటి వ్యాధులేనని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు.

ఎలా ఉంటుందోనని సరదాకు రుచి చూసి కొందరు...ఫ్యాషన్‌గా భావించి ఇంకొందరు... సమాజంలోని సమస్యలకు, సాంఘిక సంక్షోభాలకు గురై నిరాశానిస్పృహలకు లోనై వాటి నుంచి తాత్కాలికంగా బయటపడడానికి మరికొందరు... ఇలా ఈ దుర్వ్యసనాలు ప్రజలలో ప్రారంభమై అలవాటుగా పరిణమించి అవసరంగా మారి చివరకు ఆ వ్యక్తుల్ని వ్యసన బానిసల్ని చేస్తున్నాయి. ఇలా నేటి సమాజంలో నూటికి యాభైమందికి పైగా ఏదో ఒక వ్యసనానికి బానిసలై ఆ విషకౌగిలి నుంచి బయట పడాలన్నా పడలేని దుర్భర మానసిక సంక్షోభంలో జీవశ్ఛవాలుగా యాంత్రిక జీవనం గడుపుతున్నారు. హత్యలు చేస్తున్న వారిలోనూ, ఆత్మహత్యలు, వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్న వారిలోనూ నూటికి 98 మంది దుర్వ్యసనాల బానిసలేనని వివిధ సర్వేలలో తేలింది. అంతేకాక ఆయుర్దాయం తగ్గిపోయి హఠాన్మరణాలకు గురవుతున్న వారిలో కూడా వ్యసన బానిసలే అధికులుంటున్నారు.

మనదేశంలో ప్రతి ఏటా కేవలం ధూమపానం వల్లే 8 లక్షల మంది మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడిస్తోంది. మాదక ద్రవ్యాల వ్యసనపరులు ఏటా 6 నుంచి 7 వేలమంది ప్రాణాలు కోల్పోతున్నారు. మద్యపానం వల్ల ముఖ్యంగా లివర్ సిర్రోసిన్‌కు గురై లక్షలాది మంది మృత్యువుతో పోరాడుతున్నారు. దుర్వ్యసనాల వల్ల ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా అన్నీ అనర్థాలే అని తెలిసి కూడా నేటి ప్రజలు దుర్వ్యసనాలను నవసమాజపు నాగరికతా లక్షణాలుగా భావించడం ఎంతైనా దురదృష్టకరమైన విషయం.

సమాజపరంగా ఈ వ్యసనపరులు శారీరక మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. యుక్తాయుక్త విచక్షణ నశిస్తోంది. హింసా ప్రవృత్తి పెరుగుతోంది. ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో అకారణంగా యితరులతో పేచీలకు దిగడం, ఒక్కోసారి క్షణికావేశంతో హత్యలు చేయడం నేటి సమాజంలో మామూలు అయిపోతున్నాయి.

ఆరోగ్యపరంగా వ్యసనపరుని శరీరంలో ఏ అవయవమూ దుర్వ్యసనబారి నుండి బయట పడలేదు. ముఖ్యంగా రక్తమే ముందుగా మలినపడడం వల్ల శరీరంలోని అన్ని అవయవాలు వ్యసన ప్రభావానికి గురి అవుతున్నాయి.

పొగాకు పొగలోని నికోటిన్ అనే విష పదార్థం శరీరంలోకి చేరుతుంది. కార్బన్ మోనాక్సైడ్ రక్తంతో కలిసి రసాయన చర్య నొంది హిమోగ్లోబిన్‌ను కార్బాక్సీ హిమోగ్లోబిన్‌గా మార్చి రక్తపు ఆక్సిజన్ సరఫరా చేసే శక్తిని హరించివేస్తుంది. తార్ అనే పదార్థం ఊపిరితిత్తులను చేరి బ్రాంకైటిస్, ఎంఫెసీమా, లంగ్ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు దారితీస్తుంది. ఇంకా ఇవికాక హైడ్రోజన్, సైనైడ్, అమ్మోనియా, ఆర్సెనిక్ వంటి సుమారు 250 రకాల విషపదార్థాలు శరీరాన్ని చేరి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యసనబానిసల ఆరోగ్యాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. మద్యపానం విషయానికి వస్తే జిన్, బీర్, విస్కీ వైన్, బ్రాంది, రమ్ ఇలా బ్రాండ్ నేమ్ ఏదైనా సరే వీటిలోని మూలపదార్థం ఆల్కహాల్. మద్యం సేవించినప్పుడు మెదడును చేరి మనిషికి నిషానిస్తుంది. రక్తంలో 0.5 శాతం ఆల్కహాల్ ప్రవేశిస్తే పూర్తి మైకం కమ్మేస్తుంది. రక్తంలో శాతం యింకా పెరిగితే నాడీ మండలం దెబ్బతిని గుండె కొట్టుకోవడంలో మార్పులు జరిగి శ్వాస నిలిచిపోవడం, తద్వారా మరణం సంభవిస్తుంది దీర్ఘకాలిక ఆల్కహాల్ బానిసలకు లివర్ సిర్రోసిస్ పొంచి వుంటుంది. సిర్రోసిస్ రోగులు ఇటు బ్రతకలేరు, అటు చావనూలేరు జీవచ్ఛవాల్లా బ్రతుకీడుస్తూ బంధువులను బాధిస్తూ భారంగా తయారవుతారు. మాదకద్రవ్యాలు నేటి సమాజంలోని యువతరాన్ని మహమ్మారిలా

పీడిస్తున్నాయి. 10 నుంచి 16 సంవత్సరాల పిల్లలు సైతం మాదకద్రవ్యాలను విస్తృత స్థాయిలో తెలిసోతెలియకో వాడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలలో వెల్లడయిన నగ్నసత్యం. కలకత్తా, బొంబాయి, మద్రాను, హైదరాబాద్ వంటి నగరాలలో మత్తుమందులు కలిపిన ఐస్ క్రీమ్‌లు, ఇతర ఆహార పదార్థాలు అమ్ముతున్నట్లు తేలింది. మనదేశంలో సుమారు 60 లక్షల మంది మాదక ద్రవ్యాల వ్యసన బానిసలున్నారని ఒక అంచనా. ముఖ్యంగా యూనివర్సిటీ క్యాంపస్‌లలో మాదక ద్రవ్యాల వాడకం ఎక్కువగా జరుగుతోందని వెల్లయింది. కృత్రిమ స్వర్గాలను అనుభవించాలనే అపోహతో యువతరం ఈ



విషకౌగిలిలో చిక్కుకుపోతుంది. ఓపియమ్, మార్ఫిన్, హెరాయిన్, మార్జియానా, హషీష్, కొకైన్, ఎస్ ఎల్ డి ....వీటిలో ఏ మాదక ద్రవ్యం అయినా అంత్య ఫలితం మాత్రం ఒక్కటే. బరువు తగ్గిపోవటం, ఒంటరిగా ఉండాలనుకోవడం, క్షణక్షణానికి మూడ్స్ మారిపోవడం, మతిమరుపు, భయం, ఆందోళన, కనురెప్పలు ఎప్పుడూ వాలిపోతూ వుండడం, మానసిక రుగ్మతలతో అవస్థలు పడుతుంటారు. దుర్వ్యసనపరులలో సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల విటమిన్‌ల లోపం ఏర్పడి శరీరంలో కొల్లాజెన్ అనే ప్రొటీన్స్ తగ్గి పోవడంతో చిన్న వయస్సులోనే ముసలితనపు లక్షణాలు కనబడతాయి.

సమాజాన్ని పీడిస్తున్న మరో వ్యసనం వ్యభిచారం. మనదేశంలో లక్షల సంఖ్యలో వేశ్యలున్నారు. వీరివల్ల రోజుకు లక్షలాది మందికి సిఫిలిస్, గనేరియా వంటి సుఖవ్యాధులే కాక అతి భయంకరమైన చికిత్సలేని ఎయిడ్స్ వ్యాధి కూడా బహువేగంగా విజృంభిస్తోంది. ఈ రోగులు తమ బాధల్ని యితరులతో చెప్పుకోలేక తమలో తామే కృంగిపోతూ మానసిక వ్యధను అనుభవిస్తున్నారు. అందువల్లే రోగుల్ని లెక్కకట్టడం సాధ్యం కావడం లేదు.

విదేశాలతో పోలిస్తే ఒకప్పుడు మన దేశస్థులు ఈ దుర్వ్యసనాలకు దూరంగానే వుండేవారు. కాని ఇప్పుడిప్పుడే పాశ్చాత్య సంస్కృతిపై మోజుపడి దుర్వ్యసనాలకు లోనవుతున్నారనడంలో ఎంత మాత్రం సందేహం అక్కరలేదు. పురుషుల కంటే స్త్రీలలో చాలా తక్కువ కాలంలోనే దుర్వ్యసనాల దుష్పరిణామాలు బయటపడతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు అంతేకాక మహిళలు గర్భవతులైతే మలిన రక్తం శిశువులోకి ప్రవేశించడం వల్ల శిశువు నిర్మాణంలో అసాధారణ మార్పులు చోటుచేసుకుంటాయి. వ్యసన పరులకు పుట్టిన పిల్లలకు మెదడు సరిగా ఎదగకపోవడం, శ్వాస సంబంధ సమస్యలు తలెత్తడం, లోపభూయిష్టమైన జననాంగాలతో, తక్కువ బరువుతో జన్మిస్తారు. ఒక వేళ పిల్లలు పుట్టినప్పుడు బాగానే వున్నా పెద్దవారయిన తర్వాత మూర్ఛరోగం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి రోగాలు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయని పరిశోధనల్లో స్పష్టపడింది .

ఏదిఏమైనా మనుషులలోని బలహీనతలే ఈ దుర్వ్యసనాలకు పెట్టుబడులు అవుతున్నాయి. ప్రజలు, ప్రభుత్వం సంయుక్తంగా కృషిచేస్తే సమాజంలోని ఈ దుర్వ్యసనాలను అరికట్టడం అంత కష్టమేమీకాదు. మద్యపాన నిషేధం అమలులో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించినప్పుడే ప్రయోజనం వుంటుంది. ప్రజలు కూడా చైతన్యవంతులై దుర్వ్యసనాల దుష్ఫలితాలను తెలుసుకుని ప్రమాదాన్ని గుర్తించాలి. ప్రజలు ముఖ్యపాత్ర వహించాలి. స్వచ్ఛంద సేవాసంస్థలు, ప్రభుత్వం దుర్వ్యసనాల వ్యతిరేక ఉద్యమాన్ని లేవి సదస్సులు, సభలు, చర్చాగోష్టులను ఏర్పాటు చేసి వ్యసన అనర్థాలను ప్రజలకు తెలియజేయాలి. పాఠశాలస్థాయిలో పిల్లలకు దుర్వ్యసనాల గురించి విపులంగా బోధిస్తే వారు పెద్దవారయ్యాక పెడమార్గాలు పట్టే అవకాశాలు తగ్గిపోతాయి. ముఖ్యంగా ప్రభుత్వం మద్యం, సిగరెట్స్ వంటి వాటి మీద అడ్వర్‌టైజ్‌మెంట్లను నిషేధించాలి. మద్యం, మాదక ద్రవ్యాల నిరోధక చట్టాలను పటిష్టపరిచి కఠినంగా అమలు జరపాలి. ఇవి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నప్పుడే సాధ్యపడతాయని వేరే చెప్పాల్సిన పనిలేదు

వ్యసన బానిసలు గతాన్ని గురించి చింతిస్తే ప్రయోజనం లేదు. ఆత్మవిశ్వాసంతో దుర్వ్యసనాలను దూరం చేసుకుంటే ఆరోగ్యం కొంత వరకన్నా బాగుపడే అవకాశాలుంటాయి. క్రమంగా వాడుక పరిమాణాన్ని తగ్గిస్తూ చివరకు పూర్తిగా మానేయడం పట్టుదలతో వ్యసనం నుంచి బయట పడాలనుకునే వారికి ఏమాత్రం కష్టతరం కాబోదు. వీరికి ప్రభుత్వం తగిన వైద్య సౌకర్యాలు కల్పించి పునరావాసం కల్పించాలి. ఏది ఏమైనా ఈ వినాశకర, హీన వ్యసనాలను అరికట్టకపోతే ఈ తరమేకాక రానున్న తరాలకు తరాలే నిర్వీర్యమై పోతాయి. భావిదేశాన్ని తీర్చిదిద్దాల్సిన యువత జీవితాలు బాధ్యతలేని వ్యర్థ జీవితాలుగా మిగిలిపోతాయి. దుర్వ్యసనాలు యుద్ధ ప్రాతిపదికన అరికట్టకపోతే ఈ శతాబ్దపు అంతానికి అందరికీ ఆరోగ్యం అన్న నినాదం నిష్ప్రయోజనమవుతుంది

(హెల్త్ హెల్ప్ సౌజన్యంతో) ★

పుస్తక పరిచయం

మతం పేరిట మారణకాండ

బాబ్రీమసీదు విధ్వంసం 1992లో జరిగింది. గుజరాత్‌లో మతోన్మాద జాతి హత్యాకాండ 2002లో జరిగింది. భారతదేశ చరిత్రలో ప్రత్యేకించి మతతత్త్వ చరిత్రలో ఇవి కీలకమైన పరిణామాలు. ఈ సంఘటనలకు దారితీసిన నేపథ్యాన్ని, ఈ దశాబ్ద కాలంలో ఆర్థికంగా, రాజకీయంగా మతతత్త్వ శక్తులు ఎదిగిన క్రమాన్ని ఐజాజ్ అహ్మద్ గారు ఆసక్తిగా తెలియజేశారు. ప్రపంచ సామ్రాజ్యవాద నిర్మాణంలో అంతర్భాగంగా ఉండి సామ్రాజ్యవాదుల నుండి మద్దతు పొందకుండా, ఫాసిస్టు శక్తుల వినాశకర దురహంకారపు పెరుగుదలను ఊహించలేం అంటారు. ఉత్స పట్నాయక్. మన దేశంలో మతతత్వ-ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా సాగే పోరాటం, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంతో మిళితమై ఒకటై నిలవాలనీ, అందుకు భారత మేధావులు సామ్రాజ్యవాద పెత్తనం నుండి బయటపడి ఇందుకు దోహదం చేయాలని పిలుపునిస్తారు. బాబ్రీమసీదు కూల్చివేసిన తర్వాత సంఘపరివార్ ఆ మసీదు హిందూ దేవాలయంపై కట్టబడిందని నిరూపించడానికి చేసిన కుతంత్రాలను, వారి బూటకపు రాతలను సహేతుకంగా ఖండించిన తీరు ఇర్ఫాన్ హబీబ్‌గారి వ్యాసంలో చూడవచ్చు. బి.జె.పి. అగ్రవర్ణాల పార్టీ అన్న ముద్రను చెరిపివేసుకొని దళితులను, గిరిజనులను కలగలుపుకొని అతిపెద్ద పార్టీగా విస్తరిస్తుంది. ప్రపంచీకరణ లక్ష్యాలు తన ప్రయోజనానికి అనువుగా వుండబట్టే దాన్ని బాహాటంగా సమర్థిస్తున్నది. జాతీయ పార్టీగా, లౌకిక పార్టీగా ఇన్నాళ్ళుగా కొనసాగిన కాంగ్రెస్ క్రమంగా అన్ని వర్గాల్లో తన పట్టును కోల్పోవడమే కాకుండా – కొత్త విధానాలతో ముందుకు రాకపోతే తన మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. మిగతా చిన్నా చితక పార్టీలన్నీ తమ తక్షణ అవసరాల కోసం, బి.జె.పి.పై ఆధారపడటం వల్ల దాన్ని వ్యతిరేకించలేకపోతున్నాయి. విస్తరిస్తున్న బి.జె.పి. ప్రాబల్యాన్ని జావేద్ ఆలం తెలియజేశారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, మానవహక్కులు, సామాజికన్యాయం అనే భావాలు ఈ మధ్య కాలంలో చెప్పుకోదగినంతగా బలహీన పడుతున్నాయి. ఈ దిశగా మనం ఆత్మపరిశీలన చేసుకోవాలి. మనం మతతత్వ రాజకీయాలతో పోరాటం సాగిస్తూనే మానవ హక్కులు సుస్థిరం చేయాలనీ, పౌరసత్వపు సమానతను ఆచరించాలని పట్టుబట్టాలి అంటూ రొమిల్లా థాపర్ తెలియజేశారు. అయోధ్య, గుజరాత్ సంఘటనలను విశ్లేషించి సామాజిక న్యాయం, లౌకికతత్వం అనే సూత్రాల ఆధారంగా భారత పరిశీలనా వ్యవస్థ తన భవిష్యత్తును కాపాడుకోగలుగుతుందా? అని రాజీవ్ ధావన్ ప్రశ్నిస్తున్నారు. బహుళ పార్టీల, లౌకిక తత్వాల స్థానే హిందూ సాంస్కృతిక రాజకీయ ఆధిపత్యం వుండే పెత్తందారీ సంస్థలుగా తయారు చేయాలనే 'విశ్వహిందూ పరిషత్ – ప్రజాతంత్ర రాజకీయాలను మంజరీ కట్జా తెలియజేశారు. బాబ్రీమసీదు కూల్చివేత నుండి గుజరాత్ నరమేధం వరకు నడిచిన పదేళ్ళ కాలం, భవిష్యత్ కాలంలో ప్రమాదకరమైన చిక్కులు తెచ్చిపెట్టే దశాబ్దంగా కె.ఎన్.ఫణిక్కర్ అభివర్ణిస్తున్నారు. నూతన తరహా అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి మతోన్మాద ఫాసిజాన్ని ఎలా పెంచిపోషించగలిగిందో ప్రభాత్ పట్నాయక్ తెలియజేశారు. మతతత్వ వాదంపై, సామ్రాజ్యవాదంపై ఏకకాలంలో పోరాటం కొనసాగించాల్సిన ఆవశ్యకతను ఈ వ్యాసాలు తెలియజేస్తున్నాయి. ఆలోచనాపరులు తప్పకుండా చదివి తీరాల్సిన పుస్తకం ఇది.

- కె.పి.అశోక్ కుమార్



మతతత్వం-పౌరసమాజం - రాజ్యం :
1992 అయోధ్య - 2002
గుజరాత్ ప్రముఖుల వ్యాసావళి
వెల : 99/- ప్రచురణ మరియు ప్రతులకు :
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

స్వీకారం



ఉన్నదంతే! కథల సంపుటి
రచన : సర్వజిత్; వెల : 50/-
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు;



వేదాం'త'రంగాలు
చిన్ని వ్యంగ్య కవితలు
రచన : వేదాంతం జగన్నాథాచార్య;
వెల : 20/- **ప్రతులకు :** వేదాంతం జగన్నాథాచార్య, ఇ.నెం. 7-3-89, మచిలీబజార్, హన్మకొండ

రాజయోగం
రచన : గోవిందరాజు రామకృష్ణారావు
వెల : 30/-
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్‌హౌస్; నవయుగ బుక్‌హౌస్, హైదరాబాద్



జీవన్నాటకం
రచన : డి.విజయభాస్కర్
వెల : 25/- **ప్రతులకు :** శ్రీమతి డి.గౌరీదేవి, 238/2ఆర్‌టి, 2వ అంతస్తు, విజయనగర్ కాలనీ, హైదరాబాద్; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు





ఇది కళింగులేలిన ప్రాంతం

శేషు

చరిత్రలో కళింగ దేశానికి చాలా ప్రాధాన్యత ఉంది. ఇప్పటి శ్రీకాకుళం జిల్లా ఆనాడు కళింగ దేశంలో భాగంగా ఉండేది. అశోకుడి ప్రభావంతో ఇక్కడ బౌద్ధమతం గొప్ప ప్రాచుర్యం పొందింది. అనంతర కాలంలో హిందూ ఆలయాలు కూడా చాలా వెలిశాయి. జిల్లాలో ప్రధానంగా చెప్పుకోదగ్గవి ఈ ఆలయాలే. కళింగపట్నం వద్ద గల సముద్రతీరం చూసి తీరవలసిందే. తేలినీలాపురం, తేలుకుంచి పక్షి సంరక్షకకేంద్రాలు సహజసిద్ధంగా అభివృద్ధి చెందాయి.

శ్రీకాకుళం పట్టణానికి 30 కిలోమీటర్ల దూరంలో గల కళింగపట్టణం ఓడరేవు చరిత్రలో ఎంతో పేరుగడించింది. ఇక్కడి నుండి ఐరోపా దేశాలతో వాణిజ్యం జరిగేది. ఐరోపా దేశస్తులు ఇక్కడ నివసించినట్లు ఆధారాలున్నాయి. ఓడరేవు చరిత్రలో కలిసిపోగా బీచ్ మాత్రం గొప్ప పిక్‌నిక్ స్థలంగా రూపొందింది. పట్టణంలోని బౌద్ధస్థూపాలు, బీచ్‌లోని లైట్‌హవుజ్ చూడదగ్గ ప్రదేశాలు.

పక్షి సంరక్షణ కేంద్రాలు

టెక్కలి మండలంలో గల తేలినీలాపురం, ఇచ్ఛాపురం మండలంలోని తేలుకుంచి పక్షిసంరక్షక కేంద్రాలు జిల్లాలో పేరుగాంచాయి. రష్యాలోని సైబీరియా కొంగలు ఇక్కడికి వచ్చి గూళ్ళు కట్టుకుని గుడ్లుపెడతాయి. ఏటా వేలసంఖ్యలో వచ్చే పక్షులను చూడటానికి పర్యాటకులు పెద్దఎత్తున ఈ కేంద్రాలకు వస్తారు.

సంగం

నాగావళి, సువర్ణముఖి, వేగావతి నదుల సంగమ ప్రదేశమే సంగం. శ్రీకాకుళానికి 56 కిలోమీటర్ల దూరంలోని ఈ ప్రదేశం ఎంతో పవిత్రమైనదిగా జిల్లా ప్రజలు భావిస్తారు. ఇక్కడ గల సంగమేశ్వర ఆలయానికి మహాశివరాత్రి నాడు పెద్దఎత్తున భక్తులు, యాత్రీకులు తరలివస్తారు. టెక్కలి మండలకేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో గల రావివలస వద్ద గల ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయం స్వయంభు అని అంటారు. ఇక్కడి శివలింగ, అసాధారణంగా 20 మీటర్ల ఎత్తు, 3 మీటర్ల వెడల్పు ఉంటుంది. మహాభారతంలో పాండవులు అజ్ఞాతంలో ఉన్నపుడు ఇక్కడ మార్కండేయ మహర్షిని కలుసుకున్నట్లు చెబుతారు. ఈ ప్రచారంతో రావివలస ఆలయానికి ప్రాముఖ్యత ఏర్పడింది.



శ్రీకూర్మానంద ఆలయం

జిల్లాలో అద్భుత నిర్మాణ కౌశలం గలది శ్రీకాకుళం పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలోగల శ్రీకూర్మానంద స్వామి ఆలయం. 200 స్థంభాలతో నిర్మించిన ఈ ఆలయంలో క్రీస్తు శకం 11వ శతాబ్దం నుండి 19 శతాబ్దం వరకు రాజులు రాయించిన శాసనాలు దేవనాగరి లిపిలో ఉన్నాయి. చాలా క్లిష్టతరమైన దక్షిణభారత శిల్పరీతిలో ఐదంతస్థులతో నిర్మించిన గోపురం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. భారత, భాగవతాల్లోని కృష్ణుడికి సంబంధించిన ఘట్టాలతో చిత్రించిన పెయింటింగులు అజంతా గుహల్లోని చిత్రాలను మరపిస్తాయి.

అరసవల్లి

శ్రీకాకుళం పట్టణానికి సమీపంలోనే గల అరసవల్లి గ్రామంలోని సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సూర్యునికి అంకితమిస్తూ 7వ శతాబ్దంలో నిర్మించారు. ఈ ఆలయంలో ఏటా ఫిబ్రవరి, జూన్ మాసాల్లో అద్భుత దృశ్యం ఆవిష్కరించడానికి ఆనాటి శిల్పులు ఖగోళశాస్త్రాన్ని కూడా మధించారు. పైన పేర్కొన్న రెండుమాసాల్లోని రెండు రోజుల్లో ఆలయంలోని అన్ని ద్వారాలు మూసి ఉంచినా ఉషోదయాన సూర్యకిరణాలు దేవుని పాదాలపై ప్రసరిస్తాయి. ఫిబ్రవరి, జూన్ మాసాల్లో సంభవించే ఈ అద్భుతాన్ని వీక్షించడం ఒక గొప్ప అనుభూతి.

సాలిహుండం

శ్రీకాకుళం పట్టణానికి 18 కిలోమీటర్ల దూరంలో వంశధార నదీతీరాన గల సాలిహుండం గ్రామం ఒకనాడు బౌద్ధం విలసిల్లిన ప్రదేశంగా గుర్తింపు పొందింది. ఇక్కడ జరిపిన తవ్వకాల్లో బౌద్ధుల మహాస్థూపాలు, చైత్యాలు, విహారాలు ఈ ప్రాంతానికి బౌద్ధమతావలంబికులు ఇచ్చిన ప్రాధాన్యతను చెబుతుంది. క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో బౌద్ధం ఇక్కడ బ్రహ్మాండంగా విలసిల్లిందని చరిత్ర చెబుతోంది. ఈ ప్రదేశం నుండే సుమత్రా తదితర తూర్పు దేశాలకు బౌద్ధమతం వ్యాపించినట్లు మత గ్రంథాలు వెల్లడిస్తున్నాయి. ★



సమాజ చైతన్యమే 'సముద్రాల' లక్ష్యం



చలపాక ప్రకాష్

సమాజాన్ని చైతన్యపరిచే సాధనాలుగా 'కళలు' ప్రధాన భూమికను పోషిస్తాయి. సమాజాన్ని జాగృతపరిచి సరైన మార్గంలో నడిపించే శక్తి కేవలం కళలకు మాత్రమే వుంది. ఈ విధంగా వివిధ కళా ప్రక్రియల ద్వారా సమాజ చైతన్యం కోసం తీవ్రంగా కృషి చేస్తున్న కళాకారుడు సముద్రాల సత్యన్నారాయణ 75 సంవత్సరాలు నిండిన ఈ వయస్సులోనూ 'సమాజ చైతన్యం' కోసం జానపదాలు అవసరం అనే దృఢవిశ్వాసంతో విజయనగరం జిల్లా పార్వతీపురంలో వెల్ఫేర్ కల్చరల్ సొసైటీని స్థాపించి కళకొరకు, కళాకారుల అభ్యున్నతికి సత్యనారాయణ కృషి చేస్తూ వుండడం విశేషం. అటువంటి ఈ కళాచైతన్యమూర్తి గురించి ప్రజాశక్తి పాఠకులకు పరిచయం చేస్తున్నాం.

9-3-1928లో జన్మించిన సత్యనారాయణ మెట్రిక్యులేషన్ వరకు చదువుకున్నారు. ఇండియన్ లీఫ్ టొబాకో డెవలప్‌మెంట్స్‌లో ఉద్యోగం చేశారు. వివాహం అనంతరం పార్వతీపురంలో స్థిరనివాసం ఏర్పరచుకొని విశాలాంధ్ర రీడింగ్ రూమ్‌ను, మహాకవి శ్రీశ్రీ పేరిట ఒక స్టాల్‌ని నిర్వహించారు. వివిధ దినపత్రికలలో 25 సంవత్సరాలకు పైగా పని చేసి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ తరఫున 'పదండి ముందుకు' పక్ష పత్రికకు సంపాదకవర్గ బాధ్యతలు కూడా నిర్వహించారు. స్వీపర్ నుండి రోదసీయానం వరకూ ప్రాంతీయ మాండలికాలలో వీరు రాసిన ప్రత్యేక వ్యాసాలను 150కి పైగా వివిధ పత్రికలు ప్రచురించాయి.

సవర-జాతాపు-గదబ గిరిజన ప్రజలకు సంప్రదాయ నృత్యమైన 'ధింసా' నృత్యాన్ని కీ.శే. లింగ్ ప్రసాద్ వద్ద నేర్చుకున్నారు. నృత్య బృందంలో ప్రధాన పాత్ర నిర్వహించి మారుమూల గ్రామాల వారికి, కొండ శిఖరాలలో వున్న వారికి పోడు వ్యవసాయం తప్పని, భూమి సారాన్ని పాడుచేయవద్దని తాగుడు దురభ్యాసాన్ని నిరసించి అక్షరం విలువను తెలిపారు. మాండలిక భాషా ప్రయోగంతో పాటలు, నాటికలు, బుర్రకథలు, బృంద గేయాలు రాసి తన తోటి కళాకారులకు శిక్షణ నివ్వడంతో పాటు తానూ ప్రధానపాత్ర పోషిస్తూ వీధి ప్రదర్శనలిచ్చారు సత్యనారాయణ. మద్యపాన నిషేధం, అక్షర విజయం, పల్స్‌పోలియో కార్యక్రమాలకు 100 మంది కళాకారుల శిక్షణకు బాధ్యత వహించారు. ప్రపంచ మానవాళిని భయకంపితులను చేస్తున్న ఎయిడ్స్ మహమ్మారి నివారణ నిమిత్తం 'బదనిక' పేరిట బుర్రకథను రాసి రెండు బృందాలకు శిక్షణనిచ్చి ప్రదర్శనలు ఇస్తూ, ఆలిండియా మెడికల్ అసోసియేషన్ వారి సమక్షంలో ప్రదర్శించి యోగ్యతా పత్రం పొందారు. 'ధర్మాసుపత్రి' నాటిక రాసి ప్రదర్శించటం ద్వారా నేటి ఆసుపత్రులు సామాన్యులకు అందుబాటులో లేక అవినీతి, లంచగొండితనాలలో కూరుకుపోవటాన్ని బట్టబయలు చేశారు. 'గంజిమెతుకులు' నాటిక రాసి, ఆకలి సమయానికి గంజి కూడా అందుబాటులో లేక మరణించిన రిక్షా రామయ్య జీవితం ద్వారా బడుగు జీవిత బతుకును రంగస్థం చేసి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. సత్యనారాయణ రాసిన గేయాలను తమిళంలో తర్జుమా చేసి మద్రాసు నగర వీధులలో ప్రదర్శించటం ఒక ప్రత్యేకత కాగా అందుకుగాను మైలాపూర్‌నందు 9-8-1996న తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి సి.రామకృష్ణన్ అధ్యక్షతన సత్యనారాయణకు ఘన సన్మానం జరిగింది. 1997లో కేంద్ర మానవ వనరుల శాఖ వారిచే 'ఫెలోషిప్' అవార్డు, జాతీయ స్థాయి ఇఫ్‌కర్సర్ సంస్థ వారిచే 'బ్రైట్‌మెన్' అవార్డును కూడా సత్యనారాయణ అందుకున్నారు. ఇంకా వివిధ సందర్భాలలో వివిధ సంస్థలచే 100కు పైగా అవార్డులు, ఏడు రివార్డులందుకున్న సత్యనారాయణ ఐదు పదులు దాటిన వయసులో కూడా అలుపెరుగని కళాకారుడిగా ప్రజల్ని చైతన్యపరచడం కోసం తన కళారూపాలతో ముందుకు దూసుకుపోతుండటం అభినందించతగ్గ విషయం. ప్రభుత్వం పేద కళాకారుడికిచ్చే సహాయం కొంతకాలం మాత్రమే ఇచ్చి ఆపివేయడం విచారకరం. తన జీవితంలో అధిక శాతం సమాజ చైతన్యం కొరకు పాటుపడిన, ఇప్పటికీ పడుతున్న ఈ వృద్ధ కళాకారుడి శేష జీవిత భారాన్ని ప్రభుత్వం గమనించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ★

అగ్గిపుల్లకో దణ్ణం



జీవించడమంటే ఇప్పుడు
నిత్యం రాజీ పడటమే కదా?
నిజాన్ని వక్రీకరించి అనుకూలంగా మార్చేయడం
కొన్ని పొగడ్తలని వెదజల్లి
గుప్పెడు ప్రేమని కొనుక్కోవడం
అసత్యాలని అవసరాలకి ముడేసి
ఆత్మవంచనలో అవకాశాలని వెదుక్కోడం
విషాద సాగరాలకెదురీద లేక..
పోరాటాల ప్రజ్వలనానికి తోడునడవలేక...
'తృప్తి' ముసుగేసుకు మునగదీసుకుపోవడం
అవును... నిజంగా... ఇప్పుడు జీవితమంటే
ఆదాయ వ్యయాల మధ్యన
ఆత్మాభిమానాన్ని అగాధాలలో తోసేసి
కాలాన్ని కరెన్సీతో కప్పేసుకోవడమే.
కొన్ని ఆశలని పెంచేయడం
కొన్ని శ్వాసలని తృంచేయడం
'బలా'నికి కరచాలనం చేసి వంతపాడడం
మర్యాదలన్నీ ఇప్పటి పగటి వేషాలే
నీతి సూత్రాలన్నీ... గోడలకి బందీలే...
మానవత్వం మేకప్‌కిట్‌లోకి చేరిపోయాక
జీవించడమంటే..
ధైర్యాన్ని వెలేసి... దైన్యాన్ని మెలేసుకు
కుమిలిపోతూ కాలం చెత్త బుట్టలో కుళ్ళిపోవడమే
ఇప్పటికీ కొందరికి మాత్రం జీవితమంటే..
దేహాన్ని దహించుకునైనా... లోకానికి
వెలుగుల్ని వెదజల్లి... అగ్గిపుల్లల్లా ఆరిపోవడం...
ఆ అగ్గిపుల్లలకి... అక్షరాలా దణ్ణం!!

- "సూర్య" గరిమెళ్ళ

నల్లబడ్డ పచ్చదనం

ఏం మిగిలిందిక్కడ
ఓటిపోయిన కుండల్లాంటి ఇండ్లు
అవినీతి నుంచి అంగలార్చుకుంటూ
నాలుకలా సాగిన రోడ్లు
దుమ్మురేపుతుంటాయి
కలువలతో కళకళలాడిన
నిండుకుండలాంటి ఊరిచెరువు
ఇప్పుడు పీర్లముందు నిప్పుల గుండమైంది
ఎప్పుడో ఏ జెండా పండక్కో కట్టిన
రంగెలిసిన రంగుకాగితాలతో ఊర్యాపచెట్టు
పంచాయతీలకు, పడుసోల్ల పనులకు సాక్షిభూతం.
ఇప్పుడు పనిలేనట్టు నిల్చున్నది
డొక్కలీడ్చుకుపోయిన గొడ్ల మంద
పుర్రుగొడుతూ రోడ్లను రొచ్చు రొచ్చు చేస్తున్నది
బతుకు పోరాటం ఒంటి నునుపును మింగితే
ఇరవై ఐదుకే నలభై ఐదేండ్ల పొల్ల

నెత్తిన మూటతో సంకన బిడ్డతో
సాకిరేవుకు పోతున్నది
దేవునిమీద మన్నుబొయ్యా
పండిన కొద్దిపాటి పంట
ఒడగండ్ల వానతో కడగండ్ల పాలైన
రైతు కండ్ల నుంచి రక్తం కారిస్తున్నడు
ఆశల్లేని చోట
ఆసక్తి లేదు అనురక్తి లేదు
పవువుల్లాగా మనుషులు
మనుషుల్లాగా పశువులు
పరస్పర సహజీవనమైన పల్లె
ఒట్టిపోయిన అమ్మ రొమ్ములు కుతి తీర్చవు
నా పల్లె ఒకప్పుడు చైతన్య జీవన సాగరం
ఇప్పుడు రుద్రుని కాపలాలో మాగన్నుగా
నిద్రిస్తున్న జీవచ్ఛవం

- డా॥సి.హెచ్.రమేశ్

ADVOCATE

న్యాయ సలహాలు

- జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

న్యాయవాది అన్యాయం చేస్తున్నారు

లాయర్ గారికి నమస్కారములు. ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థలో చాలా మంది కండక్టర్లు చిన్న ఆర్థిక నేరాలకు ఉద్యోగాల నుండి తొలగింపబడుతున్నారు. ఉద్యోగం కోల్పోయిన వారు న్యాయం కొరకు కోర్టును ఆశ్రయిస్తే కేసులు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. నా కేసు గురించి తగిన సలహా ఇస్తారని ఆశిస్తున్నాను. కేసు నెం. 220/ 2001, నేను హైకోర్టులో 1999లో పిటీషన్ వేశాను. అద్వకేటు గారు రెండు సంవత్సరాల తర్వాత కేసును హైకోర్టు వారు లేబర్ కోర్టుకు పంపుతారని అంటున్నారు. విశాఖ కోర్టులో రెండో సంవత్సరం తర్వాత మరల హైదరాబాద్ వెళ్ళింది. అడిగిన ఫీజు ఇచ్చిన తర్వాత ఇంకనూ 20 వేలు ఇవ్వలేదని హైదరాబాద్ న్యాయవాది నన్ను వేధింపులకు గురి చేస్తున్నారు. వృత్తిపరమైన విలువలు పాటించని ఇటువంటి న్యాయవాదులపై బార్‌కౌన్సిల్ ఏమీ చర్య తీసుకోదా? న్యాయవాదుల ఫీజు వివరాలు తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

- ఎస్.సత్యనారాయణ, యానాం.

మీరు కేసు నెంబర్ రాశారు కాని ఆ కేసు నెంబర్ ఏ కోర్టులోనిదో చెప్పలేదు. కండక్టర్‌గా ఉద్యోగం పోయి ఉంటే ముందుగా మీ డిపార్టుమెంట్‌లో అప్పీలు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ న్యాయం జరగలేదనిపిస్తే లేబర్ కోర్టులో కేసు వేయాలి. అక్కడ కూడా న్యాయం జరక్కపోతే హైకోర్టులో రిట్‌పిటిషన్ వేయాల్సి వుంటుంది. మీరు కేసు హైదరాబాద్‌లో వేశాం అటునుండి లేబర్ కోర్టుకు వెళ్ళిందంటున్నారు. మీరు గతంలో లేబర్ కోర్టులో వేసిన కేసు సరైన విధంగా విచారణ జరపలేదు అనుకుంటేనే మళ్ళీ లేబర్ కోర్టుకు రిమాండ్ చేస్తుంది. లేదంటే హైకోర్టులోనే పూర్వాపరాలను బట్టి తీర్పు ఇవ్వవచ్చు.

న్యాయవాదులపై వృత్తిపరంగా మీరు ఏదైనా అభియోగం మోపాలనుకుంటే బార్‌కౌన్సిల్‌లో కంప్లయింట్ ఇవ్వాల్సి ఉంటుంది. క్రమశిక్షణా సంఘం తన పరిధిలోకి వచ్చిన కంప్లయింట్స్‌ని విచారించుటకు గాను నోటీసులు జారీ చేసి నిజం నిరూపించబడినట్లయితే తప్పక చర్య తీసుకుంటుంది.

న్యాయవాదుల ఫీజుకు సంబంధించి రూల్స్ ఉన్నాయి కాని దీనిని సరిగ్గా పాటించే వారు బహుశా అరుదు. న్యాయవాదిని బట్టీ వారికున్న అనుభవాన్ని బట్టి ఫీజు వసూలు చేస్తుంటారు.

ఆధారాలున్నాయి పట్టాలేదు

నా వయస్సు 23 సంవత్సరాలు. మా నాన్నగారు 20 సంవత్సరాలు గవర్నమెంట్ ఉద్యోగం చేసి అనారోగ్యంతో మరణించారు. తరువాత మా నాన్నగారి ఉద్యోగం నాకు ఇచ్చారు. కాని మా నాన్నగారి గవర్నమెంట్ ఎల్.ఐ.సి.కి సంబంధించి రికవరి చేసిన దానిలో కొద్ది మొత్తం మాత్రమే ఇచ్చారు. ఎందుకని అడిగితే వారు మీ నాన్న పేరుమీద ఎల్.ఐ.సి. పట్టా ఉండాలి, ఉంటేనే మరణానికి సంబంధించిన ఇన్స్యూరెన్స్ ఇస్తామంటున్నారు. మా నాన్నకు ఇచ్చినటు వంటి పట్టా ఇల్లుఖాళీ చేసే సమయాన పోయింది, అప్పుడు మేము దాని గురించి చూసుకోలేదు. ఎల్.ఐ.సి. ఏ నెంబర్‌లో బి పాలసీ కూడా రెండూ కలిసి పే స్లిప్‌లో ఆయన చనిపోయేంత వరకు అదే నెంబర్‌లో రెండు పాలసీల ప్రీమియం జీతం నుండి కట్ అవుతున్నాయి. మా దగ్గర ఆఫీసులో కటింగ్ చేసినట్లు ఆధారాలు వున్నాయి. అయినా ఎల్.ఐ.సి. వారు మాకు న్యాయం చేయడం లేదు. పట్టా లేనందున మేము ఎవరిని సంప్రదించితే న్యాయం జరుగుతుందో సలహా ఇవ్వగలరని ప్రార్థిస్తున్నాను.

- పి.రమేష్, వడ్డేపల్లి, వరంగల్.

మీ నాన్నగారి ఎల్.ఐ.సి. పట్టాపోయి వుంటే అదిపోయిన విధం తెలుపుతూ మీరు పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వండి. అట్టిరశీదుని జత చేస్తూ, ఒక అఫిడవిట్‌తో సహా ఎల్.ఐ.సి. ఆఫీసు వారికే దరఖాస్తు చేయండి. వారే డూప్లికేట్ పట్టా ఇస్తారు. మీ నాన్నగారు చనిపోయే వరకు ఎల్.ఐ.సి. డబ్బులు చెల్లిస్తున్నారు కాబట్టి మీ తండ్రి గారి డెత్ సర్టిఫికెట్స్ పెట్టి వారసులుగా మీరు క్లయిమ్ చేయాలి. ఎల్.ఐ.సి. వారు కింది స్థాయి వారు కాదంటే డివిజన్, రీజనల్ స్థాయి అధికార్లను సంప్రదించండి, అప్పటికీ న్యాయం జరగకపోతే కన్స్యూమర్ ఫోరంని ఆశ్రయించండి. మీకు తప్పక న్యాయం జరుగుతుంది.

అద్దెకున్నవారు ఖాళీ చేయకపోతే ఏం చేయాలి?

మేము ఇల్లు బాడుగకు ఇచ్చాము. ఆ వ్యక్తి ప్రతి నెలా బాడుగ సరిగా ఇవ్వడం లేదు. అందువల్ల మేము ఇల్లు ఖాళీ చేయమంటే చేయను అంటున్నాడు. మేము అతన్ని ఇల్లు ఖాళీ చేయించాలంటే ఏం చేయాలి? 3 నెలలు టైమ్ ఇస్తాము ఖాళీ చేయమంటే కూడా ఖాళీచేయను అని అంటున్నాడు. నా సమస్యకు సలహా కోరుతున్నాను. వీలైనంత త్వరగా అతనిపై ఏ చర్య తీసుకోవాలో సలహా ఇవ్వగలరు. పోలీస్ కంప్లయింట్ ఇవ్వాలా లేక ఏం చేయాలి.

- ఆల్తాఫ్ హుస్సేన్.కె., ఆదోని, కర్నూలు జిల్లా

మీ సమస్య తీరడానికి చట్టపరిధిలో ఇల్లు ఖాళీ చేయించాలంటే పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం కాదు. బాడుగ చెల్లించని వ్యక్తికి తగు విధంగా నోటీసు ఇచ్చి మీరు కోర్టులో 'ఎవిక్షన్' పిటిషన్ వేసి బాడుగ చెల్లించడం లేదని నిరూపించగలిగితే కోర్టు ప్రతివాదిని ఖాళీ చేయమని ఉత్తర్వులు జారీ చేస్తుంది. కిరాయిదారుడు బాడుగ సకాలంలో చెల్లిస్తున్నాడని అతడు నిరూపించుకోగలిగితే అతనిని ఖాళీ చేయమని కోర్టు చెప్పదు. ఈ న్యాయప్రక్రియకు చాలా సమయం పడుతుంది.

రుచి

పచ్చి బఠాణీ పలావ్

కావలసిన వస్తువులు :

బియ్యం	: రెండు కప్పులు
పచ్చి బఠాణీలు	: ఒక కప్పు
నెయ్యి	: పావు కప్పు
జీలకర్ర	: ఒక టీ స్పూన్
ఉప్పు	: తగినంత

తయారుచేసే విధానం:

బియ్యాన్ని నానబెట్టి ఉంచుకోవాలి. ఒక పాత్రలో నెయ్యి వేసి కాగిన తరువాత అందులో జీలకర్ర వేయాలి. జీలకర్ర వేగిన తరువాత బఠాణీలు వేయాలి. ఒక నిముషం తరువాత బియ్యాన్ని నీళ్ళలో నుంచి తీసి అందులో వేయాలి. ఓ ఐదు నిముషాలు వేగిన తరువాత నాలుగు కప్పుల నీళ్ళు పోయాలి. అన్నం కొంచె ఉడుకుబట్టిన తరువాత సన్నని సెగపై ఉంచి నీరు తీసిన తరువాత దించాలి. దీనిని వేడిగా బంగాళా దుంప కుర్మా లేదా పెరుగు పచ్చడితో తింటే చాలా రుచిగా ఉంటుంది.

వంటలు పంపవలసిన చిరునామా: రుచి, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, అశోక్‌నగర్, స్ట్రీట్ నెం:1 హైదరాబాద్ 20

బొంబాయి రవ్వ చేగోడీలు

కావలసిన వస్తువులు:

బొంబాయి రవ్వ	: 2 కప్పులు
పుట్నాలు (వేయించిన శనగపప్పు)	: 1 కప్పుకు కొంచెం తక్కువ
ఎండుకొబ్బరి కోరు	: 1 కప్పుకు కొంచెం తక్కువగా
కారం	: ఒక టీ స్పూన్
ఉప్పు	: తగినంత
జీలకర్ర	: 1 టీ స్పూన్
నూనె	: తగినంత

తయారుచేసే విధానం:

బొంబాయి రవ్వ, పుట్నాలు, ఎండుకొబ్బరి కోరు విడివిడిగా వేయించుకొని పొడి చేసుకోవాలి. అన్నీ ఒక గిన్నెలో వేసి ఉప్పు, కారం, జీలకర్ర వేసి కలపాలి. ఇందులో అరకప్పు నూనెను వేడిచేసి కలపాలి. ఇప్పుడు తగినన్ని నీళ్ళతో పిండిని కలుపుకోవాలి. తరువాత చేగోడీలు తయారు చేసుకొని నూనె కాగిన తరువాత లైట్ కలర్ వచ్చే వరకూ వేయించుకోవాలి. అన్నీ వేయించి పొడి చేసిన మిశ్రమం కనుక చేగోడీలు త్వరగా వేగుతాయి. వెరైటీ చేగోడీలు చాలా తక్కువ మందికి తెలుసు. మీరందరూ కూడా చేసి ఎంజాయ్ చేయండి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్థసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

· మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

Cyan